

## మూడుసార్లు తప్పా

హైస్కూల్ చదువులో తాను పెద్దగా రాణించలేకపోయానని అక్షర హాసన్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో వరుసగా మూడుసార్లు విఫలమైనట్లు వెల్లడించారు. ఆ తర్వాత చదువుపై ఆసక్తి తగ్గిపోయిందని, పాస్ కావడం కష్టంగా అనిపించడంతో చదువును మధ్యలోనే ఆపేశానని చెప్పారు.

8

ప్రజా గళమే

# స్పందన

SPANDHA NEWS

జాతీయ తెలుగు దినపత్రిక

Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106




శనివారం || 3-10-2026 || సంపుటి: 1 || సంచిక: 60 || పేజీలు: 8 || వెల : రూ.5/-

Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal

## ముంబైలో పోటాపోటీ నిరసనలు

సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన

సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన

పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత

భారీగా మోహరించిన పోలీసులు



.. వివరాలు 4లో

## జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియపై నిరసనల హోరు

1,100 మంది అదుపులోకి..

4





రాయలసీమ ప్రజలకు సాగునీరు అందిస్తే బంగారం పండిస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర 36 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న సహకారాన్ని ఎన్నటికీ మరువలేమని సీఎం పేర్కొన్నారు.

# కరువు సీమ ఇక సిరుల సీమ

### రాయలసీమలో ఉద్యాన విప్లవం!

- మదనపల్లెలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్
- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- పాల్గొన్న కేంద్ర మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, అనంత్ అంబానీ

**మదనపల్లె (స్పంద న్యూస్):** కరువు సీమగా పేరున్న రాయలసీమను ఉద్యాన రంగం ద్వారా సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం రూ. లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' బృహత్తర ప్రాజెక్టులకు ఘనంగా శంకుస్థాపన జరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి

మిగతా 2లో

## నదులను కాపాడుకుందాం

2

వ్యర్థాలు వదలొద్దని సీఎం చంద్రబాబు సూచన



## అనంత్ అంబానీ ఏపీ ముద్దుబిడ్డ!

2

ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధాన్ని పంచుకున్న యువ పారిశ్రామికవేత్త

తనను ఏపీ బిడ్డగా భావించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

ప్రసంగం అనంతరం అభినందించిన నిర్మల, పవన్, లోకేష్



## రాయలసీమ దశ మారుస్తున్నాం..

ఫ్యాక్షన్ రాజకీయాలు, అశాంతి నుంచి అభివృద్ధి బాటలోకి..

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

.. వివరాలు 2లో



## టార్గెట్ 2029

17 లక్షల ఎకరాల్లో సాగు! గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై మంత్రి అచ్చెన్నాయుడు

.. వివరాలు 2లో



## గాంధీ బాటలో నడుద్దాం

హోం మంత్రి వంగలపూడి అనిత

.. వివరాలు 2లో



## గాంధీ స్మృతిలో ప్రధాని మోదీ

### గాంధీజీ, లాల్ బహదూర్‌లకు ఘన నివాళులు!

గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని 'గాంధీ స్మృతి' వద్ద నిర్వహించిన ప్రత్యేక సర్వధర్మ ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీజీ బోధించిన సత్యం, శాంతి, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ప్రధాని స్మరించుకున్నారు.

.. వివరాలు 4లో

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా మారే ఛాన్స్

3

12న ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం





ఇద్దరు పాక్ చొరబాటుదారుల

## కాల్చివేత

కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్

04



## రుషికొండ తీరంలో తీవ్ర విషాదం

- మధురవాడ ఐటీ సెజ్ బీచ్‌లో ముగ్గురు విద్యార్థుల గల్లంతు
- అలల తాకిడికి కొట్టుకుపోయిన సూర్యప్రకాష్, నీలేష్, ప్రశాంత్
- సెలవు కావడంతో సముద్ర స్నానానికి వెళ్లిన బాలురు
- ఎట్టకేలకు ఒడ్డుకు చేరిన ప్రశాంత్ మృతదేహం

3

## 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి

3





## లక్ష కోట్లు కాదు.. లక్ష అబద్ధాలు!

కూటమి ప్రభుత్వంపై గడికోట శ్రీకాంత్ రెడ్డి ఫైర్

3

# రాయలసీమ దశ మారుస్తున్నాం..

**ఫ్యాక్షన్ రాజకీయాలు, అశాంతి నుంచి అభివృద్ధి బాటలోకి..**

**సీఎం చంద్రబాబు కృషితోనే సీమకు కొత్త రూపు**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**మదనపల్లె (స్పంద న్యూస్):** దశాబ్దాలుగా కరువుతో పోరాడిన రాయలసీమను ఇకపై కరువు సీమగా కాకుండా, ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కరవుతో కాదు, అభివృద్ధితోనే రాయలసీమకు కొత్త గుర్తింపు తీసుకువస్తామన్నారు. శుక్రవారం మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పవన్ వెల్లడించారు. రైతులకు సాగునీరు మెరుగుపరచడంతో పాటు, రవాణాకు అనువుగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌కు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో, పచ్చని చెట్లను సైతం నరికేసే అశాంతి వాతావరణం నుంచి రాయలసీమను అభివృద్ధి బాటలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు.

## రెండేళ్లలో రూ.8 వేల కోట్ల పనులు..

'పల్లె పండుగ' ద్వారా రాయలసీమలో గత రెండేళ్లలో రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో, రాయలసీమలో 62 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును విస్తరించినట్లు తెలిపారు. 70 వేల ఫామ్ పాండ్ల నిర్మాణంతో పాటు, ప్రాజెక్ట్ జలధార ద్వారా చేపట్టిన చర్యలతో సీమలో భూగర్భ జలాలు సగటున 3.6 మీటర్లు పెరిగాయన్నారు. రూ. 4,500 కోట్లతో 5 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశామని వివరించారు. రాయలసీమ రైతుల పట్టుదలకు ఉద్యాన సాగులో వస్తున్న మార్పులే నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు. 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అనంతపురం లాంటి ప్రాంతంలోనూ యాపిల్ (కె.ఎల్.డి. యాపిల్) సాగు చేయడం సాధ్యమైందని గుర్తుచేశారు. రాయలసీమలో టమాటా, దానిమ్మతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బెర్రీస్ లాంటి అధిక విలువ కలిగిన పంటలను సాగు చేస్తున్నారని.. మదనపల్లె ఆసియాలోనే అతిపెద్ద టమాటా మార్కెట్‌గా ఎదగడం రైతుల అపారమైన సత్తాకు నిదర్శనమని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు.

# టార్గెట్ 2029..

**7 లక్షల ఎకరాల్లో సాగు!**

**గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై మంత్రి అచ్చెన్నాయుడు కీలక ప్రకటన**



**మదనపల్లె (స్పంద న్యూస్):** రాయలసీమలో ఉద్యాన రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆ ప్రాంత రూపురేఖలు మార్చేందుకు రూ. లక్ష కోట్లతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ హార్టికల్చర్ (అగ్రికల్చర్) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమ రైతుల దశ తిరగనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాయలసీమలో 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయని, 2029 నాటికి ఈ విస్తీర్ణాన్ని 17 లక్షల ఎకరాలకు పెంచే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. అదనంగా 11 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును ప్రోత్సహిస్తామన్నారు. అలాగే ప్రస్తుతం సీమలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తి జరుగుతోందని, 2029 నాటికి దాన్ని 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగంగా 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో భారీగా మౌలిక వసతులు కల్పించనున్నట్లు మంత్రి వివరించారు. సాగునీరు, రహదారులు, కోల్డ్ చైన్ (శీతలీకరణ గిడ్డంగులు), మార్కెటింగ్ లాంటి సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేసి.. రాయలసీమలో పండే ఉద్యాన పంటలను నేరుగా దేశ, విదేశీ మార్కెట్లకు తీసుకెళ్లేలా పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా రాయలసీమ రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దార్శనికత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంపూర్ణ సహకారంతోనే రాయలసీమలో ఈ చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగలిగామని మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచి, రాయలసీమ ఉద్యాన రంగాన్ని దేశంలోనే ప్రముఖ హబ్‌గా తీర్చిదిద్దేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ హార్టికల్చర్ రెండు బృహత్తర ప్రాజెక్టులు అత్యంత కీలకంగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# కరువు సీమ ఇక సిరుల సీమ!

(మొదటి పేజీ తరువాయి..)

పవన్ కళ్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ తదితరులు ఈ ప్రాజెక్టులకు శిలాఫలకం ఆవిష్కరించారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను రూ. లక్ష కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కేంద్ర సహకారంతో రూ. 40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ. 60 వేల కోట్లు సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. రాయలసీమలోని 8 జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని రైతులకు మేలు జరిగేలా ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. దీని ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేసి, అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించనున్నారు. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు (సీడ్ టు షిప్‌మెంట్) రైతులకు అండగా నిలవడమే దీని ప్రధాన ఉద్దేశమని సీఎం వివరించారు. కివీ, అవకాడో, యాపిల్, స్ట్రాబెరీ లాంటి పంటలను ప్రోత్సహించి రైతులకు స్థిరమైన ఆదాయం కల్పిస్తామన్నారు.

## నీళ్లిస్తాం.. బంగారం పండించండి..

రాయలసీమ ప్రజలకు సాగునీరు అందిస్తే బంగారం పండిస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర 36 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న సహకారాన్ని ఎన్నటికీ మరువలేమని సీఎం పేర్కొన్నారు. దేశ మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న నిర్మలా సీతారామన్‌ను ఆయన 'ఉక్కు మహిళ'గా అభివర్ణించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోందని కొనియాడారు. సభ అనంతరం నేతలు మొక్కలు నాటి, ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అనంత్ అంబానీ ఏపీ ముద్దుబిడ్డ!

- హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆకట్టుకున్న ప్రసంగం
- ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని పంచుకున్న యువ పారిశ్రామికవేత్త
- తనను ఏపీ బిడ్డగా భావించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ప్రసంగం అనంతరం అభినందించిన నిర్మల, పవన్, లోకేష్



**మదనపల్లె (స్పంద న్యూస్):** గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని చాటుకుంటూ ఆయన చేసిన భావోద్వేగ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్రంతో తనకున్న బంధాన్ని గుర్తుచేసుకున్న అనంత్ అంబానీ.. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయగలనో, ఎలా ఉపయోగపడగలనో తనకు మార్గనిర్దేశం చేయాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు. అనంత్ అంబానీ ప్రసంగం ముగిసిన వెంటనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు ఆయనను అభినందించారు.

## ఏపీ ముద్దుబిడ్డ అంటూ ఆలింగనం..

అనంత్ అంబానీ ప్రసంగం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. వేదికపైనే ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి.. అనంత్ అంబానీ చెప్పిన మాటలపై స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని ఆయన సభాముఖంగా ప్రకటించారు. రిలయన్స్ సంస్థ రాష్ట్ర అభివృద్ధిలో భవిష్యత్తులో మరింతగా భాగస్వామి కావాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# నదులను కాపాడుకుందాం

- వ్యర్థాలు వదలొద్దని సీఎం చంద్రబాబు సూచన
- విజయవాడలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం




**విజయవాడ (స్పంద న్యూస్):** నదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కృష్ణా, గోదావరి లాంటి నదుల్లోకి వ్యర్థాలు వదలొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, 5 కోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విజయవాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీటిని వదిలేయడంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దిగువ ప్రాంతాల ప్రజలు నదీ జలాలనే తాగునీటిగా వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. నదులు కలుషితమైతే పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, దాని వల్లే ఎల్ నినో లాంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంతో కృష్ణా నదికి నీరు రాని పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆలోచనల్లోనూ స్వచ్ఛత ఉండాలని సూచించారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు స్వచ్ఛతకూ గాంధీజీ ప్రాధాన్యమిచ్చారని, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను ఆయనే స్వయంగా శుభ్రం చేశారని సీఎం వివరించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని, తాను కూడా అందులో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## సంపదగా వ్యర్థాలు..

చెత్తను సమస్యగా చూడకుండా సంపద సృష్టించే వనరుగా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి, బయోగ్యాస్, ఎరువులు తయారు చేస్తూ రాష్ట్రాన్ని సర్క్యులర్ ఎకానమీ దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. జీరో గార్బేజ్ లక్ష్యంతో ఈ-ఆటోలు, పుష్‌కార్టులు ఏర్పాటు చేశామని, కొత్తగా చెత్త పేరుకుపోకుండా ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో నెట్ జీరో కాన్సెప్ట్ అమలు చేస్తున్నామని, దీనిపై అధ్యయనం కోసం ఐఐటీ కాన్పూర్‌తో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించారు. స్వచ్ఛతా రంగంలో సేవలందించిన వారియర్లు, ఎన్జీవో సంస్థలు, స్వచ్ఛ కాలనీలు, అసోసియేషన్లకు సీఎం చంద్రబాబు అవార్డులు అందజేశారు. విశాఖ నోవోటెల్, విజయవాడ పాయకాపురం తదితర రైతు బజార్లు, తెనాలి సహా పలు మున్సిపాలిటీలు, మూలపేట తదితర గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టళ్లకు అవార్డులు ప్రదానం చేశారు. తిరుమల, విజయవాడ దుర్గమ్మ, సింహాచలం ఆలయాలకు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ బాటలో నడుద్దాం

- హోం మంత్రి వంగలపూడి అనిత
- అనకాపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర అవార్డుల ప్రదానం
- ప్రతి ఒక్కరూ పరిశుభ్రత, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపు
- అభివృద్ధి పథంలో అనకాపల్లి జిల్లా దూసుకుపోతోందని ప్రశంస



**అనకాపల్లి (స్పంద న్యూస్):** మహాత్మా గాంధీ చూపిన బాటలో నడుస్తూ పరిశుభ్రత, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించాలని ఆమె సూచించారు. అనకాపల్లిలోని పెంటకోట ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్రఉస్వర్ణ ఆంధ్ర' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి అనిత ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పరిశుభ్రత, సేవాభావంతో, మంచి సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలు, గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## విజేతలకు అవార్డుల ప్రదానం..

అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని హోం మంత్రి అనిత సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రఉస్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఎంపికైన అవార్డు గ్రహీతలకు ఆమె అవార్డులను ప్రదానం చేసి, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియపై నిరసనల హోరు
- ఆప్ నేత అతిశీ, సంజయ్ సింగ్ సహా 1,100 మంది అదుపులోకి
- సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ బంద్.. 11 మెట్రో స్టేషన్ల మూసివేత
- మహాత్మా గాంధీ జయంతినాడే దేశ రాజధానిలో హైటెన్షన్



**న్యూఢిల్లీ (స్పంద న్యూస్):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనలతో దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి రోజైన శుక్రవారం ఇండియా కూటమిలోని ఆప్, కాంగ్రెస్, వామపక్షాలు, కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యూఐ వంటి విద్యార్థి, యువజన సంఘాలు జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించడంతో మధ్య ఢిల్లీ ప్రాంతం అట్టుడికింది. జంతర్ మంతర్, పార్లమెంట్ స్ట్రీట్ పరిసరాల్లో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. న్యూఢిల్లీ జిల్లా పరిధిలో సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. అయితే వేలాదిగా తరలివచ్చిన నిరసనకారులు పోలీసు బారికేడ్లను తోసుకుంటూ ముందుకెళ్లేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఢిల్లీ మాజీ సీఎం అతిశీ, ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝా, సీపీఎం నేత బృందా కారత్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝాతో పాటు 1,100 మందికి పైగా నేతలు, విద్యార్థి సంఘాల కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

నిరసనల దృష్ట్యా భద్రతా చర్యలను అధికారులు కట్టుదిట్టం చేశారు. జంతర్ మంతర్ నుంచి సెంట్రల్ ఢిల్లీకి వచ్చే మార్గంలోని 11 ప్రధాన మెట్రో స్టేషన్లను ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తాత్కాలికంగా మూసివేసింది. పలుచోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సెంట్రల్ ఢిల్లీలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. నెట్ బంద్ కావడంతో ఓలా, ఉబర్, భారత్ ట్యాక్సీ వంటి క్యాబ్ బుకింగ్ సేవలు నిలిచిపోయాయి. గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ చెల్లింపులు సైతం పనిచేయకపోవడంతో సాధారణ పౌరులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

### ఆరోపణలను ఖండించిన ఈసీ

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరిట తీవ్ర అవకతవకలు జరిగాయని, అర్హులైన లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని విపక్ష నేతలు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందని, సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ అంతా నిర్ణీత నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా జరుగుతోందని స్పష్టం చేసింది. భారీ నిరసనలు, అరెస్టులు, పోలీసు ఆంక్షలతో ఢిల్లీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# లక్ష కోట్లు కాదు.. లక్ష అబద్ధాలు!

- కూటమి ప్రభుత్వంపై గడికోట శ్రీకాంత్ రెడ్డి ఫైర్



**రాయచోటి (స్పంద న్యూస్):** లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ అంటూ ఆర్భాటపు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది లక్ష కోట్లు కాదు.. లక్ష అబద్ధాల పాలన అని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం ఆయన రాయచోటిలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు అల్లాడుతున్నారని శ్రీకాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లముందే పంటలు, ఉద్యాన తోటలు ఎండిపోతున్నా రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. ఆర్భాటపు ప్రచారం చాలించి, మొక్కలు ఎండిపోకుండా రైతుకు భరోసా కల్పించే కార్యాచరణ ఏదైనా ఉంటే చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 78.7 శాతం వర్షపాత లోటు ఉందని, రైతుల పరిస్థితి ఏమిటో ముఖ్యమంత్రి క్షేత్రస్థాయికి వచ్చి చూడాలని సూచించారు.

### పబ్లిసిటీ స్టంట్లు కట్టిపెట్టండి..

అన్నదాతలు 800 అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడక, అప్పులపాలై మూడో బోర్ వేసే స్తోమత లేక ఆర్తనాదాలు చేస్తుంటే ముఖ్యమంత్రికి వినిపించడం లేదా అని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు మాత్రం మదనపల్లెలో బస్సు యాత్రలు, హెలికాప్టర్ టూర్ల కోసం వందల కోట్లు ఖర్చు పెడుతూ పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఖరీఫ్ పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ప్రతి ఎకరాకు రూ. 25 వేలు, సాగు కాని భూములకు రూ. 15 వేల చొప్పున నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



# 'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి

**మదనపల్లె, అక్టోబర్ 02:** 'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు. ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

# ఫ్లైదుబాయ్ విమానంపై దాడి ఉగ్రవాద చర్యే..

- వెనకుండి నడిపించిన వారికి భారీ మూల్యం తప్పదు
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర హెచ్చరిక
- విమానంపై దాడి ఉగ్రవాద చర్యే: యూఏఈ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 02:** ఫ్లైదుబాయ్ విమానం ఘటన వెనుక ఉగ్రవాద చర్యలు ఉన్నాయని, కో-పైలట్‌ను పంపినవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహు వార్నింగ్ ఇచ్చారు. కో-పైలట్ ఇస్లామిక్ తీవ్రవాద భావజాలానికి ప్రేరేపితమయ్యాడని, ప్రయాణికులు సహా విమానాన్ని కూల్చివేయాలనే ఉద్దేశంతో ఉన్నాడని అన్నారు. "అతడ్ని పంపిన వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఆయన హెచ్చరించారు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై దాడికి బయటి వ్యక్తులు ఆదేశించారా? అనేది దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్న తరుణంలో నెతన్యాహు హెచ్చరికలు వెలువడ్డాయి. "సమయం గడిచేకొద్దీ విషయం మరింత స్పష్టమవుతోంది.. నిందితుడు ఇస్లామిక్ తీవ్రవాద భావజాలాన్ని స్వీకరించాడు.. ప్రయాణికులతో సహా విమానాన్ని కూల్చివేయడానికే అతను వచ్చాడు.. అతడ్ని ఎవరైనా పంపారా? అనేది మేము దర్యాప్తు చేస్తున్నాం.. ఒకవేళ పంపినట్టు తేలితే.. వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. బుధవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఫ్జ్1073లో కో-పైలట్.. కాక్‌పిట్‌లో భారత్‌కు చెందిన కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ఆయుధం దాడి చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 174 మందితో ప్రయాణిస్తున్న ఆ విమానం.. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ముందే 30 సెకన్ల కన్నా తక్కువ వ్యవధిలోనే 34 వేల ఎత్తు నుంచి నుంచి దాదాపు 14,000 అడుగుల మేర కిందకు పడిపోయింది. ఇదిలా ఉండగా, ఒమాన్ జాతీయుడైన కో-పైలట్ వెనుక ఇరాన్ ఉన్నట్టు అమెరికా, ఇజ్రాయెల్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. పరోక్షంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ హస్తం ఉండొచ్చు అంటూ వ్యాఖ్యలు చేశారు. అయితే, దీనిపై అధికారికంగా ఎటువంటి సమాచారం ఇప్పటి వరకు రాలేదు. దర్యాప్తు జరుగుతోందని, అదే నిజమైతే ఇరాన్‌పై భారీ దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. యూఏఈ అధ్యక్ష సలహాదారు అన్వర్ గర్గాష్ సైతం ఈ దాడిని తీవ్రమైన "ఉగ్రవాద చర్య"గా అభివర్ణించారు. ఆ క్లిష్ట సమయంలో భారత పైలట్ స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, బాధ్యతాయుత ప్రవర్తన వెలకట్టలేనిదని కొనియాడినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. తీవ్ర గాయాల పాలైనప్పటికీ పెను ఉగ్ర విలయాన్ని అడ్డుకుని వందలాది ప్రాణాలను కాపాడిన స్మిత్ నిజమైన హీరో అని ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ఈ ప్రమాదకర ఘటనపై యూఏఈ న్యాయ విభాగం అధికారికంగా విచారణ ప్రారంభించింది. ముందస్తు ప్రణాళికతోనే దాడి చేశారా, ఏదైనా ఉగ్రవాద ముఠాతో సంబంధాలు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా పరిశీలిస్తోంది. దర్యాప్తు కొనసాగుతున్నందున నిరాధార పుకార్లు, కథనాలు ప్రచారం చేయవద్దని అధికారులు ప్రజలను కోరారు.పిట్‌లో జరిగిన పెనుగులాటలో తీవ్ర రక్తస్రావం జరుగుతున్నా స్మిత్ మచ్చార్ డోర్ లాక్ తెరిచి ప్రయాణికులను కాపాడటంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా దించగలిగారు. ప్రస్తుతం అబుదాబిలో చికిత్స పొందుతున్న స్మిత్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది.







# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా మారే ఛాన్స్
- 12న ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ
- కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు
- ఏపీలో వర్షాలు కురుస్తాయా అని రైతుల ఎదురుచూపులు

**అమరావతి (స్పంద న్యూస్):** నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# రుషికొండ తీరంలో తీవ్ర విషాదం!

- మధురవాడ ఐటీ సెజ్ బీచ్‌లో ముగ్గురు విద్యార్థుల గల్లంతు
- అలల తాకిడికి కొట్టుకుపోయిన సూర్యప్రకాష్, నీలేష్, ప్రశాంత్
- గాంధీ జయంతి సెలవు కావడంతో సముద్ర స్నానానికి వెళ్లిన బాలురు
- ఎట్టకేలకు ఒడ్డుకు చేరిన ప్రశాంత్ మృతదేహం



**విశాఖపట్నం (స్పంద న్యూస్):** గాంధీ జయంతి సెలవు కావడంతో సరదాగా గడుపుదామని సముద్ర తీరానికి వెళ్లిన విద్యార్థులను రాక్షస అలలు కాటేశాయి. విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ సెజ్ (రుషికొండ) తీరంలో సముద్రంలో దిగిన ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గాంధీ జయంతి సెలవు కావడంతో మధురవాడ పరిధిలోని మల్లయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఆరుగురు బాలురు మధురవాడ ఐటీ సెజ్ తీరానికి వెళ్లారు. సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ముగ్గురు బాలురు కొట్టుకుపోయారు. గల్లంతైన విద్యార్థుల్లో మల్లయ్యపాలేనికి చెందిన ఎస్. సూర్యప్రకాష్ (14, శ్రీ వెంకటేశ్వర విద్యాపీఠ్), ఎస్. నీలేష్ (14, సృజన స్కూల్), పి. ప్రశాంత్ (14, సృజన స్కూల్) ఉన్నారు. మిగిలిన ముగ్గురు బాలురు ప్రాణాలతో బయటపడ్డారు. విద్యార్థులు సముద్రంలో గల్లంతైన సమాచారం అందుకున్న నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు, పీఎంపాలెం సీఐ బాలకృష్ణ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లైఫ్ గార్డ్‌లు, స్థానిక మత్స్యకారుల సహాయంతో సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ప్రశాంత్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు సూర్యప్రకాష్, నీలేష్ కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విద్యార్థుల గల్లంతుతో వారి ఇళ్ల వద్ద తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# తమిళనాడులోనూ మహిళలకు ఫ్రీ బస్సు స్కీమ్

**చెన్నై, అక్టోబర్ 02:** తమిళనాడు సీఎం బాధ్యతలు చేపట్టిన విజయ్.. ఎన్నికల్లో ఇచ్చిన ముఖ్యమైన హామీలపై దృష్టి పెట్టారు. రాష్ట్రంలోని మహిళల కోసం ప్రతిష్ఠాత్మకమైన 'వెట్రి పయనం' (విజయ యాత్ర) పథకానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలోని కోయంబేడు బస్ స్టాండ్‌లో అత్యంత వైభవంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం విజయ్ స్వయంగా పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభించారు. వెట్రి పయనం పథకం ప్రారంభించిన సీఎం విజయ్ స్వయంగా బస్సులో ప్రయాణించి.. మహిళా ప్రయాణికులకు ఫ్రీ బస్ టికెట్లను ఇచ్చారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న మహిళలు తమ అభిమాన నాయకుడిని చూసి ఉద్వేగానికి లోనయ్యారు.

స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 3 అక్టోబర్ 2026

## సంపాదకీయం



# కాలుష్యానికి కారణమెవరు!?

## చలికాలం వచ్చిందంటే ఢిల్లీని కమ్మేస్తున్న విషపు గాలి

**వాహనాలు.. రోడ్డు దుమ్ము.. నిర్మాణాలు.. పరిశ్రమలు.. పంట వ్యర్థాల దహనం.. కారణాలు అనేకం**

ఢిల్లీ పేరు వినగానే ఎర్రకోట, పార్లమెంటు, ఇండియా గేట్‌తోపాటు ఇప్పుడు మరో పదం కూడా గుర్తుకొస్తోంది.. కాలుష్యం! ఏటా చలికాలం సమీపించగానే దేశ రాజధానిని పొగమంచులా కమ్మేసే విషపు గాలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మరి ఢిల్లీ కాలుష్యానికి అసలు కారణమెవరు?.. వాహనాలా?.. నిర్మాణాలా?.. పరిశ్రమలా?.. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనమా?.. లేక ఏటా సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాతే మేల్కొనే ప్రభుత్వ వ్యవస్థలా?.. నిజానికి ఒక్క కారణాన్ని వేలెత్తి చూపేంత సరళమైన సమస్య ఇది కాదు. వాహన ఉద్గారాలు, రోడ్డు దుమ్ము, నిర్మాణ కార్యకలాపాలు, వ్యర్థాల దహనం, పరిశ్రమలు, ప్రాంతీయ కాలుష్యంతోపాటు చలికాలంలో గాలి వేగం తగ్గడం వంటి వాతావరణ పరిస్థితులన్నీ కలసి ఢిల్లీ గాలిని ప్రమాదకరంగా మారుస్తున్నాయి.

### చలికాలం రాగానే.. ఆంక్షల చిట్టా!

ఢిల్లీ ప్రభుత్వం 2026-27 శీతాకాల కాలుష్య నియంత్రణ ప్రణాళికను ఇప్పటికే ప్రకటించింది. చెల్లుబాటయ్యే కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం లేని వాహనాలకు ఇంధనం ఇవ్వకుండా తనిఖీలు కఠినతరం చేయడం, పార్కింగ్ రుసుములను పెంచడం, కార్యాలయ వేళలను మార్చడం, కొన్ని దశల్లో సగం మంది ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేసేలా చర్యలు చేపట్టడం ఇందులో ఉన్నాయి. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ గుర్తింపు వ్యవస్థ ఉన్న 500 ఇంధన కేంద్రాల్లో అక్టోబర్ 1 నుంచే తనిఖీలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ధూళిని వెదజల్లే కూల్చివేతలు, బహిరంగ నిర్మాణ కార్యకలాపాలపై నవంబర్ 1 నుంచి జనవరి 31 వరకు ఆంక్షలు విధించనున్నారు. డిసెంబర్ 10 నుంచి జనవరి 20 వరకు నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపై మరింత కఠినమైన నిషేధం అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్యం అత్యంత తీవ్రస్థాయికి చేరిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే నివారణ చర్యలు అమలు చేయడమే ఈసారి ప్రణాళిక లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది.

### పంట వ్యర్థాలే మొత్తం కారణమా?

ఢిల్లీ కాలుష్యం చర్చకు వచ్చిన ప్రతిసారీ పంజాబ్, హర్యానా తదితర ప్రాంతాల్లో పంట వ్యర్థాల దహనం ప్రధానంగా తెరపైకి వస్తుంది. అయితే ఢిల్లీ కాలుష్యమంతటికీ రైతులే కారణమని చెప్పడం వాస్తవ పరిస్థితిని అతిసరళీకరించడమే అవుతుంది. పంట వ్యర్థాల దహనం కొన్ని రోజుల్లో కాలుష్య తీవ్రతను గణనీయంగా పెంచగలిగినా.. ఢిల్లీలోనే ఉత్పత్తయ్యే వాహన, దుమ్ము, నిర్మాణ, వ్యర్థాల దహనం వంటి కాలుష్య మూ లాలు ఏడాది పొడవునా ప్రభావం చూపుతాయి. కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాల తాజా సమీక్ష కూడా సమస్యను ఢిల్లీ-ఎన్‌సీఆర్ మొత్తానికి సంబంధించిన ప్రాంతీయ సమస్యగానే చూ స్తోంది. బాణాసంచా అంశం కూడా దీపావళి సమయంలో మరోసారి చర్చకు వస్తోంది. సుప్రీంకోర్టు తాజా విచారణలో పూర్తిస్థాయి నిషేధానికీ, రోజంతా నిర్బంధం లేకుండా బాణాసంచా కాల్చడానికీ అనుకూలంగా లేదని పేర్కొంది. అనుమతించాల్సిన బాణాసంచా రకాలు, సమయాల విషయంలో సమతుల్య విధానం అవసరమని అభిప్రాయపడింది. తుది పరిమితులపై తదుపరి విచారణల్లో మరింత స్పష్టత రావాల్సి ఉంది.

### తాత్కాలిక మందులతో ఎంతకాలం?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఏటా అక్టోబర్, నవంబర్ రాగానే నిర్మాణాలు ఆపడం, వాహనాలపై ఆంక్షలు విధించడం, పార్కింగ్ రుసుములు పెంచడం, ఇంటి నుంచి పని చేయించడం వంటి అత్యవసర చర్యలు తీసుకుంటున్నారు. ఇవి తీవ్రమైన కాలుష్య సమయంలో అవసరమైన చర్యలే. కానీ ఢిల్లీ గాలి శాశ్వతంగా మెరుగుపడాలంటే ప్రజా రవాణా విస్తరణ, రోడ్డు దుమ్ము నియంత్రణ, నిర్మాణ నిబంధనల నిరంతర అమలు, చెత్త దహనం నివారణ, పరిశ్రమల ఉద్గారాల పర్యవేక్షణ, స్వచ్ఛ ఇంధన వినియోగంతోపాటు పొరుగు రాష్ట్రాలతో ఏడాది పొడవునా సమన్వయం అవసరం. అందుకే 'ఢిల్లీ కాలుష్యానికి కారణమెవరు?' అన్న ప్రశ్నకు ఒక వ్యక్తి, ఒక ప్రభుత్వం, ఒక రాష్ట్రం లేదా రైతులను మాత్రమే చూపించడం సమాధానం కాదు. అనేక కాలుష్య మూలాలు, భౌగోళిక-వాతావరణ పరిస్థితులు కలిసి సమస్యను తీవ్రం చేస్తున్నాయి. వాటన్నింటినీ ఒకేసారి లక్ష్యంగా చేసుకున్న దీర్ఘకాలిక కార్యాచరణ ఎంత సమర్థంగా అమలవుతుందన్నదే ఢిల్లీకి స్వచ్ఛమైన గాలి ఎప్పుడు దక్కుతుందో నిర్ణయించనుంది.



# గాంధీ స్మృతిలో ప్రధాని మోదీ

**గాంధీజీ, లాల్ బహదూర్‌లకు ఘన నివాళులు!**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 2 (స్పంద న్యూస్):** గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని 'గాంధీ స్మృతి' వద్ద నిర్వహించిన ప్రత్యేక సర్వధర్మ ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీజీ బోధించిన సత్యం, శాంతి, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ప్రధాని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా గాంధీ స్మృతిని దర్శించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్ముడు పోషించిన చారిత్రాత్మక పాత్రను, ఆయన అందించిన సామాజిక సామరస్య సందేశాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌లోని గాంధీజీ సమాధిని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి, అక్కడ జరిగిన సర్వధర్మ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని విజయ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానిగా సేవలందించిన శాస్త్రి, 1965 ఇండో-పాక్ యుద్ధ సమయంలో దేశానికి అందించిన సమర్థవంతమైన నాయకత్వాన్ని, ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని, పాటించిన ఉన్నత విలువలను ప్రధాని కొనియాడారు. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల ద్వారా భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన తీరు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గాంధీజీ జయంతిని ఐక్యరాజ్యసమితి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, గాంధీజీ మరియు లాల్ బహదూర్ శాస్త్రుల దివ్య స్మృతికి దేశవ్యాప్తంగా నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.

# జంతర్ మంతర్ వద్ద పోలీస్ బస్సును అడ్డుకున్న మహిళ

**నిరసనకారులను తీసుకెళుతుండగా చోటుచేసుకున్న ఘటన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక మహిళ పోలీస్ బస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు, కొన్ని నెలల క్రితం ముంబైలో మోడల్ రియా అహిర్ చేసిన చర్యతో దీనిని పోలుస్తూ రకరకాలుగా స్పందిస్తున్నారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుని బస్సులో తరలిస్తున్న క్రమంలో, సదరు మహిళ ఆ వాహనానికి అడ్డుగా నిలబడింది. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ మహిళా పోలీసులు ఎవరూ లేరని 'ఎక్స్' వేదికగా వెలువడిన ఒక పోస్ట్ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. గత జులై 2026లో ముంబైలో జరిగిన నిరసనల సందర్భంగా, విద్యార్థులను తరలిస్తున్న పోలీస్ వ్యాన్‌ను రియా అహిర్ (రియా ఇకౌసియా) అడ్డుకున్నారు. వర్షంలో తడుస్తూనే సుమారు 40 నిమిషాల పాటు వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా ఆమె నిలువరించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ఆమె సోషల్ మీడియాలో విశేష గుర్తింపు పొందారు. తాజాగా జంతర్ మంతర్ వద్ద చోటుచేసుకున్న ఘటన కూడా అదే తరహాలో ఉండటంతో, కేవలం ప్రచారం కోసమే ఈ మహిళ రియా అహిర్‌ను అనుకరించి ఉండవచ్చని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ మహిళ ఎవరు, ఆమె ఉద్దేశం ఏంటి అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు ఇంకా తెలియరాలేదు.





# ఇద్దరు పాక్ చొరబాటుదారుల కాల్చివేత

**కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు**

**చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:** పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు

- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన
- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు



**ముంబై, అక్టోబర్ 2:** ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్స్ట్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్స్ట్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.



స్పంద
శనివారం, 3 అక్టోబర్ 2026

# గాంధీజీ,శాస్త్రిజీ జీవితాలు స్ఫూర్తిదాయకం

## కలెక్టర్ సాయి కాంత్ వర్మ

**తెనాలి, అక్టోబర్ 2 (స్పంద న్యూస్) :** మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జీవితాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో శుక్రవారం జరిగిన వేడుకలలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి మహనీయులన్నారు. మహానాయకుల జీవితాల నుంచి అనేక విషయాలు నేర్చుకొని, వారు చూపిన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. గాంధీజీ జీవితం నుంచి ఓర్పు, సహనం అనేవి ప్రధానంగా నేర్చుకోవలసిన అంశాలని తెలిపారు. గాంధీజీ ఎంతో ఓర్పుతో, పట్టుదలతో లక్ష్యాన్ని వీడకుండా అనేక సంవత్సరాల పాటు స్వాతంత్ర్య పోరాటం సాగించారని గుర్తుచేశారు. ఎన్ని ఇబ్బందులు, జైలు శిక్షలు ఎదురైనా దేశ స్వాతంత్ర్యం కోసం నిలబడటం ఎంతో ఆదర్శనీయమన్నారు. ఈ తరం ప్రజలు, యువత వారిని ఆదర్శంగా తీసుకొని సరైన మార్గంలో నిలకడగా, ఓర్పుగా ముందుకు సాగాలని, అహింస, సత్యం అనే మార్గాలను ఆచరించారని చెప్పారు. అన్యాయానికి ఎదురు నిలబడటానికి హింస మాత్రమే మార్గం కాదని నమ్మిన వ్యక్తి అన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక ఉద్యమాల్లో ప్రజలను భాగస్వాములను చేశారని తెలిపారు. గాంధీజీ అంటరానితనాన్ని వ్యతిరేకించారన్నారు. ప్రతి మనిషికి సమాన గౌరవం ఉండాలని చెప్పారని పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జీవితం నుంచి నిరాడంబరత, నిజాయితీ వంటి గుణాలను అలవర్చుకోవాలని చెప్పారు. ఉన్నతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్నప్పటికీ ఆయన సాధారణ జీవితాన్ని గడిపారని, నమ్మిన సిద్ధాంతాల కోసం గట్టిగా నిలబడ్డారని ప్రశంసించారు. వారి గొప్పతనాన్ని, భావాలను తర్వాతి తరాలకు అందించడమే కాకుండా, వారు చూపిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేశ సమగ్రత, లౌకికవాదం కోసం ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీజీ

## మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

**గుంటూరు, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** భారత దేశ సమగ్రత కోసం, లౌకిక దృక్పథం అమలు కోసం ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీజీ చిరస్మరణీయులని, ఆయన అడుగుజాడల్లో భారత్ పయనిస్తేనే విశ్వగురువుగా మారుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. గాంధీజీ 157వ జయంతిని పురస్కరించుకుని అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో గుంటూరులోని జిన్నా టవర్ సెంటర్ వద్ద ఉన్న గాంధీజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ ప్రజలందరినీ ఏకతాటిపై నిలిపి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడితే, నేటి పాలకులు ప్రజలను కులాలు, మతాల వారీగా విడదీస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలంటే ఎన్నికల కమిషన్ పట్ల విశ్వాసం కలగాలని, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని లేదా సుప్రీంకోర్టు నేతృత్వంలోనే భవిష్యత్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. నేటి పాలకులు గాంధీజీ ఆశయాలకు తిలోదకాలు ఇస్తున్నారని మండిపడ్డారు. మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా మార్చడం, పర్యావరణ పరిరక్షణను విస్మరించడం విచారకరమన్నారు. నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ లాంటి మహనీయులే గాంధీజీని అనుసరించారని గుర్తుచేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. గాంధీజీ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసిన మహనీయుడని కొనియాడారు. ఆలయ ప్రవేశాలు, మత సమరస్యం కోసం కృషి చేసిన బాపూజీ ప్రపంచ నాయకుడిగా ఎదిగారని, అందుకే ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు పోలూరి వీరారెడ్డి, మాదిగ జన సేవా సమితి నాయకులు దాసరి జాన్ బాబు, పరంగి సత్యరాజ్, ఏపీపీ సునీల్, వినుకొండ నవీన్, కాపు రాష్ట్ర నాయకురాలు మాదా రాధా, పాలకయాల వెంకట్, బీసీ నాయకులు కొణిదె గోపి కృష్ణ, మస్తాన్ వలి, దళిత నాయకులు మండాది సుబ్బారావు, బత్తుల కోటేశ్వరరావు, సముద్రాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి 122వ జయంతిని పురస్కరించుకుని ఆయనకూ ఘనంగా నివాళులర్పించారు.



# మహాత్మా... మన్నించుమా.. మేమింతే... మేము మారము..




**గుంటూరు, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** మనిషిలో మానవత్వం నశించిపోతుంది. మంచితనం కనుమరుగైపోతుంది. అసలు మనిషి అన్న విషయమే మర్చిపోతున్నాం. ఇవన్నీ ఎందుకు అనుకుంటున్నారా రక్త సంబందికులే పట్టించుకోని ఈ రోజుల్లో అతను ఎవరో మనకు తెలియదు కానీ నేను చూడని స్వాతంత్రం నా తరువాత అయినా కావాలి అనుకోని 27 సంవత్సరాలు జైలు జీవితం గడిపి భారతీయుల కోసం ముఖ్యంగా మనకోసం మన భవిత కోసం తన ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం తోటి పోరాటం చేసి అసువులు బాసిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ జన్మదినం నేడు జాతిపితగా మన ముద్దుగా పిలుచుకునే మన గాంధీతాత పుట్టినరోజు నేడు దానికి నిదర్శనంగా యావత్ భారతదేశం అక్టోబర్ రెండో తేదీన మద్యము, మాంసము విక్రయాలు చేయకూడదు అని నిర్ణయించుకున్నారు. కానీ ఇవి పేపర్ స్టేట్మెంట్లుగా, తామరకు మీద నీటి బొట్టుగా మిగిలిపోతున్నాయి. ఎన్నికల సమయంలో అది చేస్తాం ,ఇది చేస్తాం ,నీకు అంత ఇస్తాం, నీకు ఇంత ఇస్తాం అని చెప్పుకుని తిరిగే రాజకీయ నాయకులు నేడు ఎక్కడికి వెళ్లారు, ఏమైపోయారు, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బయట కనబడతారా, ఈ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడికి మనం ఇచ్చే నివాళి ఇదేనా గుంటూరు నగరంలో ఎటు చూసినా మాంస విక్రయాలు యదేచ్ఛగా జరిగాయి. తప్పు ఎవరిది? ప్రభుత్వాన్నిదా? ఒక్కరోజు కూడా మాంసం తినకుండా ఉండలేని ప్రజలదా? ఒక్కరోజు మాంసం తినకపోతే మనం బతకలేమా ఆ మహనీయుడికి మనం ఇచ్చే నివాళి ఇదేనా . రెస్టారెంట్లో ఈరోజు మాంసం ఎక్కడి నుంచి వచ్చింది ఈరోజు వచ్చిందే గా? లేదా నిన్నటిదా? ఒకవేళ నిన్నటిది అయితే ఆహార శాఖ సిబ్బంది వారు ఏం చేస్తున్నారు. ఈరోజుది అయితే మున్సిపల్ శాఖ సిబ్బంది వారు ఏం చేస్తున్నారు.. వీధులకు గ్రామాలకు గాంధీ పేరు పెట్టుకోవడం కాదు ఆయన తెచ్చిన స్వరాజ్యాన్ని కాపాడుకుందాం. ఆయన పేరు నిలబెడదాం.

## కాకుమాను మండలంలోని అన్ని గ్రామాల్లో
# ఘనంగా గ్రామసభలు!

**కాకుమాను, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** స్థానిక మండల పరిషత్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక గ్రామ-సభలు ఏర్పాటు చేసి.. గ్రామాభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంబీడీఓ) జి. వీరాస్వామి కొండబాలవారిపాలెం, వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాల్లో ప్రత్యేక అధికారి హోదాలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలను బహుకరించారు. అనంతరం 'అమ్మ పేరిట ఒక మొక్క' (తల్లి పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సంబంధిత సిబ్బంది ద్వారా ప్రజలకు వివరించామని, గ్రామాభివృద్ధికి ప్రజల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించామని తెలిపారు. పారిశుద్ధ్యం, 'స్వచ్ఛ రథం', తడి-పొడి చెత్త నిర్వహణ, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, అంగన్ వాడీ పాఠశాలల పనితీరు, బాల్యవివాహాల నిషేధం, నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ నమోదుతో పాటు 'వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' కార్యక్రమ లక్ష్యాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె. నాగయ్య, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఆయా గ్రామాల నాయకులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి ప్రధాన కారణం

**తెనాలి, అక్టోబర్02(స్పంద న్యూస్):** ఖాళీ స్థలాలతోపాటు ఇంటి పరిసరాలలో పాత టైర్లు కూలర్లు వంటి వాటిలో నీటి నిల్వ ఉండడమే దోమల పుట్టుకకు ప్రదాన కారణమని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక తెనాలి పట్టణ మలేరియా సిబ్బందితో కలసి శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా నందులపేటలోని నరేంద్రదేవ్ కాలనీ నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమలు పెరుగుదలకు అవకాశం ఉన్న మూలాలను గుర్తించి వాటిని తొలగింప చేశారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం దోమల నివారణ ఆవశ్యకతను ప్రజలకు వివరించడమేనని అన్నారు. దోమల నివారణకు తీసుకునవలసిన జాగ్రత్తల గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ. నీటి నిల్వలలో దోమలు గుడ్లు పెట్టి వాటి యొక్క సంతతిని అభివృధి చేసు కొనుట ద్వారా మలేరియా , డెంగ్యూ , చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి అనేక వ్యాధులు వ్యాప్తి చెందటానికి కారణం అవుతాయని తెలిపారు. ప్రజలు వర్షాకాలంలో ఎక్కడా నీరు నిల్వఉండకుండా అప్రమత్తంగా ఉండాలని,నీటి నిల్వల పై మూతలు పెట్టి ఉంచుకోవాలని కోరారు. అనంతరం దోమ కాటునుండి రక్షణ పొందుటకు సాయంత్రం సమయంలో తలుపులు కిటికీలు మూసి ఉంచాలని, పూర్తి వస్త్రధారణ ధరించాలని, దోమతెరలు, ఇతర దోమ కాటు నుండి రక్షించుకునే విధానాలను వాడుకోవాలని కోరారు. అనంతరం మలేరియా సిబ్బందితో కలిసి దోమలు నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు , హెల్త్ అసిస్టెంట్స్ దీపాల శ్రీనివాసరావు ,షేక్ నవీద్, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘం నేత వెంకటేశ్వరరావు జన్మదినోత్సవం



**తెనాలి,అక్టోబర్02(స్పంద న్యూస్):** మృదు స్వభావి, నిత్య కృషీవలుడు, నిగర్వి, స్నేహశీలి జొన్నాదుల వెంకటేశ్వరరావు అని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం జొన్నాదుల వెంకటేశ్వరరావు జన్మదినోత్సవాన్ని మండలంలోని జాగర్లమూడి గ్రామంలోని శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద స్నేహితులు బంధువులు శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోన్నాదుల వెంకటేశ్వరరావు ప్రముఖ న్యాయవాదిగా,బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, జాతిపిత మహాత్మా గాంధీ జన్మించిన రోజునే ఆయన జన్మించటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఆయన మరెన్నో పదవుల నలంకరించాలని కోరారు. బర్త్డే కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీ చౌక్ లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి వార్డులోని బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మెహర్, జనార్ధన్ మాస్టర్ హరిదాసు గౌరీ శంకర్ శ్రీనివాస్ రెడ్డి, జొన్నాదుల శివరామకృష్ణ, మురళి, రమేష్, వెంకట సాయి, మణికంఠ, శశాంక్, సభాపతి, కృష్ణమోహన్ ఓంకార్ ప్రసాదు,బండారు శ్రీనివాసరావు, కోట అక్కేశ్వరరావు, నరాల శెట్టి సురేష్, ఆలపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేపు బుర్రిపాలెంలో సీఎం పర్యటన

**తెనాలి,అక్టోబర్02(స్పంద న్యూస్)** తెనాలి మండలం బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి జిల్లా కలెక్టర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు. ముఖ్యమంత్రి 4వ తేదీన పి.ఎం.ఏ.వై గ్రామీణ్ క్రింద మంజూరైన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. బుర్రిపాలెం గ్రామం పొలిమేరల్లో బహిరంగ సభను ఏర్పాటు, గ్రామంలో శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఐదు వేల మంది వరకు ప్రజలు బహిరంగ సభకు హాజరు కావచ్చని అందుకు తగిన విధంగా తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.టి.వి రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.కృష్ణ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఎస్పీ బి.జనార్ధన రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక





## టీడీపీ కార్యాలయంలో గాంధీ జయంతి

**తెనాలి, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** భారతావని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నిస్వార్థంగా త్యాగం చేసిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని టీడీపీ నేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ కొనియాడారు. శుక్రవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని టీడీపీ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ.. నేటి యువత మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి, ప్రేమ అనే సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, వసంతం అశోకవర్ధన, తాడిబోయిన హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, యుగంధర్, బోయపాటి అరుణ, తవ్వా ప్రసాద్, మల్లవరపు విజయ్, సుద్దపల్లి నాగరాజు, రాజేంద్రప్రసాద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, సాంబయ్య, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి



**దుర్గి, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** గాంధీ జయంతిని పురస్కరించుకుని దుర్గి గ్రామంలో దుర్గి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కపలవాయి శ్రీనివాసరావు (టెంపర్ శ్రీను) ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెంపర్ శ్రీను మాట్లాడుతూ.. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారని, ఆయన జీవితం మరియు నడిపిన స్వాతంత్ర్య పోరాటాలు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పౌరహక్కుల ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచాయని కొనియాడారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస మార్గాల్లో పయనిస్తూ ప్రతీ ఒక్కరూ దేశ సౌభాగ్యానికి, అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. వేడుకల అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దసరా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ!



**పెదకాకాని, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే దసరా నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ధర్మకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఈ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం అధికారులకు, పాలకమండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కొమ్మూరు మల్లికార్జునరావు, ధూపాటి శివశంకరరావు, వరికూటి వీర సుధాకరరావు, పాముదుర్తి సాంబశివరావు, కొండా దుర్గ రాజేశ్వర రెడ్డి, బండారి శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో సభ్యులు పేటేటి ధన మహేశ్వర ప్రసాద్, స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, వేద పండితులు, ఆలయ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీను వెంటనే తొలగించాలి

**సత్తెనపల్లి, అక్టోబర్ 2 (స్పంద) :** వామపక్షాల నిరసన కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొని తమ మద్దతు తెలిపారు.సత్తెనపల్లి తాలూకా సెంటర్లో వామపక్ష పార్టీల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సుధీర్ భార్గవ రెడ్డిమాట్లాడుతూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, సీజేఐతో కూడిన కమిటీని పునరుద్ధరించాలని,సర్ ప్రక్రియ నిలిపివేయాలని, సర్ లో తొలగించిన ఓటర్లను జాబితాలో చేర్చాలని తెలియజేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, సీపీఎం,కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి ర్యాలీ నిర్వహించారు.



# సత్తెనపల్లిలో డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి పర్యటన

### గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రీలకు నివాళులు!





**సత్తెనపల్లి, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తెనపల్లి 28వ వార్డులో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని వైఎస్సార్సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తెనపల్లి పట్టణంలోని 28వ వార్డులో ఆయన పర్యటించారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అనంతరం వార్డులో పర్యటిస్తూ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి అనుభవాలను పంచుకుంటూ యువతలో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపారు. ఈ సందర్భంగా వార్డు ముఖ్య నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతీ ఒక్కరికీ రాబోయే రోజుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తూ అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. మహనీయులకు ఘనంగా జయంతి నివాళులు: అంతకుముందు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, నిర్మాణంలో మహనీయులు అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు బాసు లింగారెడ్డి, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, చల్లంచర్ల సాంబశివరావు, వార్డు ఇంచార్జ్ తాళ్ల కళ్యాణ్, వార్డు ప్రెసిడెంట్ జాన్ పాల్‌తో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు అనుబంధ విభాగాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నా స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ

### గుంటూరు నియోజకవర్గ నాయకులతో చర్చ

**సత్తెనపల్లి, అక్టోబర్ 2 (స్పంద):** గుంటూరు కార్యాలయం నందు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు,సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులతో,సభ్యులతో చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగా ఎలా ముందుకు వెళ్లాలి,బూత్ స్థాయి నుండి పార్టీని ఎలా బలోపేతం చేయాలి,అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో కూటమి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల్లో కూడా కూటమి జయభేరి మోగించి,గ్రామ స్థాయి నుండి అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలు మనకు చాలా కీలకమని, గ్రామ పంచాయతీ



నుండి జిల్లా పరిషత్ వరకు కూటమి జెండా ఎగరాలని, గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను,ఇప్పుడు మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని,అభ్యర్థుల ఎంపికలో నిజాయితీ,పార్టీ కోసం కష్టపడే వారికే ప్రాధాన్యత ఇస్తామని, అందరం కలిసి కట్టుగా పనిచేస్తే 100% స్థానిక సంస్థలు మనవేనని కన్నా తెలియజేశారు.

# మహాత్మా గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### సత్యం,అహింసా మార్గంలో నడిచిన గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టాలి:జొన్నలగడ్డ

**సత్తెనపల్లి,అక్టోబర్ 2 (స్పంద):** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సత్యం, అహింసను ఆయుధాలుగా మలచుకుని స్వాతంత్ర్య సమరాన్ని నడిపిన మహాత్మా గాంధీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు.మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా శుక్రవారం పల్నాడు సత్తెనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటంతోపాటు, సమాజంలో అంటరానితనం,కులమత వివక్ష నిర్మూలన, సమానత్వం,సామరస్యం నెలకొనాలని గాంధీజీ ఆకాంక్షించారని తెలిపారు. అహింసా సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిన గాంధీజీ జయంతిని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా గుర్తించడం ఆయన ఆలోచనా విధానానికి లభించిన అంతర్జాతీయ గౌరవానికి నిదర్శనమన్నారు.



గాంధీజీని జయంతి రోజున స్మరించుకోవడంతోనే బాధ్యత ముగియదని, ఆయన చూపిన సత్యం, శాంతి,అహింస,కరుణ, సమానత్వం వంటి విలువలను నిత్యజీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మద్ది వెంకటేశ్వర్లు,దేవరపల్లి కాశి, నాయకులు షేక్ సైదా, సుభాని,మేదర శ్రీనివాసరావు, ఆర్.పురుషోత్తం,జూపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి

**కాకుమాను, అక్టోబర్ 2:స్పంద ప్రతినిధి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. వీరాస్వామి మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా యం పి డి ఓ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీజీ అనుసరించిన అహింసా సిద్ధాంతం ఒక ఆదర్శవంతమైన శక్తివంతమైన ఆయుధంగా నిలిచిందని అన్నారు. సత్యం, అహింస మార్గాల్లో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీజీ ఆశయాలను, ముఖ్యంగా సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ యంపిడిఓ కె. నాగయ్య, మండల నాయకులు నల్లమోతు. పూర్ణచంద్రరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీజీకి పుష్పాంజలి ఘటించారు.





## సాసాలో జిల్లా స్థాయికి ఎంపిక ఐన యానిమేటర్ షాలిని

**కర్లపాలెం అక్టోబర్ 2 స్పంద న్యూస్ :** కర్లపాలెం మండలంలోని పేరలి గ్రామానికి చెందిన యానిమేటర్ షాలిని స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో జిల్లా స్థాయి కి ఎంపిక అవడం తో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం బాపట్ల సాయి గ్రాండ్ లో ఏర్పాటు చేసిన సా సా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్ అవార్డుని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో గ్రూప్ సభ్యులకు సా సా కార్యక్రమంలో అత్యున్నత ప్రతిభ కనబరచడం తో జిల్లా స్థాయి కి ఎంపికయ్యారు అని తెలిపారు.



# పర్వీన్ హూడాకు స్వర్ణం

## భారత్‌కు 13వ పతకం

**నాగోయా, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ పర్వీన్ హూడా స్వర్ణ పతకం సాధించింది. మహిళల 65 కేజీల విభాగంలో చైనీస్ తైపెకు చెందిన చెన్ నిన్-చిన్‌పై 3-2 తేడాతో విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో పర్వీన్ చివరి రౌండ్‌లో నిలకడగా పోరాడి విజయం అందుకుంది. తొలి రెండు రౌండ్లలో పోరు తీవ్రంగా సాగింది. ఇరువురు బాక్సర్లు పంచ్‌లతో ప్రతిదాడులకు దిగడంతో స్కోరు సమంగా మారింది. నిర్ణయాత్మక మూడో రౌండ్‌లో పర్వీన్ ప్రత్యర్థి దాడులను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక పంచ్‌లు సంధించింది. చివరకు న్యాయనిర్ణేతలు 3-2తో పర్వీన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. పర్వీన్ విజయం ద్వారా ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు ఒకే రోజున రెండో మహిళల స్వర్ణం లభించింది. అంతకుముందు లవ్లీనా బోర్గోహెయిన్ మహిళల 75 కేజీల విభాగంలో పసిడి పతకం సాధించింది. పర్వీన్ స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో 13వ స్వర్ణ పతకం చేరింది. పర్వీన్ హూడా గతంలోనూ ఆసియా క్రీడల్లో పతకం సాధించింది. 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో ఆమె కాంస్యం గెలిచినా, అనంతరం డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన సస్పెన్షన్ కారణంగా ఆ పతకాన్ని కోల్పోయింది. ఈసారి అదే వేదికపై స్వర్ణం సాధించడం ఆమెకు కీలక పునరాగమనంగా నిలిచింది.

# సుజీత్ కల్కల్‌కు స్వర్ణం

## 2-9 నుంచి సంచలన విజయం

**నాగోయా, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ సత్తా చాటాడు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఫైనల్లో తజకిస్థాన్‌కు చెందిన అబ్దుల్‌మజీద్ కుదేవ్‌పై 10-9 తేడాతో అద్భుత విజయం నమోదు చేశాడు. దీంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు రెజ్లింగ్‌లో తొలి స్వర్ణం లభించింది. ఫైనల్లో సుజీత్ ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఒక దశలో 2-9తో వెనుకబడ్డాడు. అయితే చివరి దశలో అనూహ్యంగా పుంజుకున్న భారత రెజ్లర్ వరుస పాయింట్లు సాధించాడు. కీలక సమయాల్లో రెండు టేక్‌డౌన్లు సాధించి స్కోరును 10-9కు తీసుకెళ్లాడు. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. సుజీత్ విజయంతో పాటు అక్టోబరు 2న భారత్‌కు బాక్సింగ్, ఆర్చరీలోనూ స్వర్ణాలు దక్కాయి. పురుషుల 80 కేజీల బాక్సింగ్‌లో అంకుశ్ పంగల్ స్వర్ణం సాధించాడు. మహిళల 65 కేజీల్లో పర్వీన్ హూడా, 75 కేజీల్లో లవ్లీనా బోర్గొహైన్ కూడా పసిడి పతకాలు గెలిచారు. మహిళల రికర్వ్ టీమ్ ఆర్చరీలోనూ భారత్ స్వర్ణం సాధించింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 75కు చేరగా.. అందులో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయియ్యాడు. ఇండియన్ రెజ్లర్‌ను అటాక్ చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో 0-4 తేడాతో నితేశ్ ఓడిపోయాడు. గ్రీకో రోమన్ స్టయిల్ రెజ్లింగ్‌లో గతంలో ఇండియాకు రెండు సార్లు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. 1962లో జకర్తాలో జరిగిన గేమ్స్‌లో 52కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు గెలిచారు. ఇవాళ జరిగిన ఫైనల్లో నితేశ్‌ను స్కోరింగ్ చేయకుండా జపనీస్ ప్లేయర్ నిలువరించాడు. ఫస్ట్ బౌట్‌ను 2-0 తేడాతో నకాజాటో ముగించాడు. లోకల్ ఫేవరేట్ అయిన నకాజాటో సెకండ్ బౌట్‌లో విజయవంతంగా నితేశ్‌ను నేలకూల్చాడు. దీంతో అతనికి 4-0 ఆధిక్యం లభించింది. చివరి నిమిషంలో నితేశ్ అటాక్ చేసినా.. నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో అడ్డుకున్నాడు.



# 44 ఏళ్ల నిరీక్షణకు తెర

## హాకీలో భారత్‌కు పసిడి!

### ఆసియా క్రీడల మహిళల హాకీలో రెండోసారి స్వర్ణం

### డిఫెండింగ్ ఛాంపియన్ చైనాపై 1-0తో భారత్ సంచలన విజయం



**గిఫు, అక్టోబర్ 2 (స్పంద న్యూస్):** నలభై నాలుగేళ్ల నిరీక్షణ ముగిసింది.. భారత మహిళల హాకీ జట్టు మళ్లీ ఆసియా రారాణిగా అవతరించింది. ఐచి-నగోయా ఆసియా క్రీడల మహిళల హాకీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను 1-0తో మట్టికరిపించి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 1982 ఢిల్లీ ఆసియా క్రీడల తర్వాత భారత్‌కు మహిళల హాకీలో ఇదే తొలి పసిడి. మొత్తంగా ఇది రెండో స్వర్ణ పతకం. ఆరంభం నుంచే హోరాహోరీగా సాగిన ఫైనల్లో పదో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి అద్భుతమైన రివర్స్ హిట్‌తో చైనా గోల్‌పోస్టును ఛేదించింది. తన 200వ అంతర్జాతీయ మ్యాచ్‌లోనే ఆమె చేసిన ఈ గోల్ భారత్‌కు చారిత్రక స్వర్ణాన్ని అందించడం విశేషం. ఆ తర్వాత చైనా వరుస దాడులతో ఒత్తిడి పెంచినా భారత రక్షణ విభాగం పట్టువదల్లేదు. చైనాకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను భారత గోల్‌కీపర్ సవిత అద్భుతంగా అడ్డుకోవడం మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది. చివరి నిమిషాల్లో చైనా గోల్‌కీపర్‌ను కూడా బయటకు తీసి అదనపు ఆటగాడితో దాడికి దిగినా భారత డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. తుది విజిల్ మోగగానే భారత క్రీడాకారిణుల సంబరాలు మిన్నంటాయి.

### పసిడితో పాటు ఒలింపిక్స్ టికెట్

ఈ విజయం భారత్‌కు ఆసియా క్రీడల స్వర్ణంతోపాటు మరో భారీ బహుమతిని అందించింది. ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల పురుషుల, మహిళల హాకీ విజేతలకు నేరుగా ఒలింపిక్ బెర్త్ లభిస్తుందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రకటించింది. 1982లో తొలిసారి ఆసియా క్రీడల మహిళల హాకీలో స్వర్ణం సాధించిన భారత్.. ఆ తర్వాత 1998, 2018లో ఫైనల్‌కు చేరినా రజతంతో సరిపెట్టుకుంది. ఇప్పుడు 44 ఏళ్ల తర్వాత మరోసారి అగ్రస్థానాన్ని అందుకుని చరిత్ర సృష్టించింది.

# 2023 ఓటమి గుర్తుంది..

## 2027 ప్రపంచకప్ గెలవాలి: గిల్

**కేప్‌టౌన్, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి ఇంకా గుర్తుందని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఆ లోటును 2027 ప్రపంచకప్‌లో పూడ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్ తనకు, భారత జట్టుకు ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాడు. 2023 ప్రపంచకప్‌లో భారత్ అద్భుతంగా ఆడినా.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోవడం బాధించిందని గిల్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ ఫలితం మొత్తం టోర్నీపై ప్రభావం చూపుతుందని, ఫైనల్లో ఓడిపోవడం మరింత బాధాకరమని చెప్పాడు. అందుకే 2027 ప్రపంచకప్‌ను పూర్తి చేయాల్సిన పనిగా భావిస్తున్నామని వెల్లడించాడు. 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబరు 2న ప్రారంభం కానుంది. భారత్ తన తొలి మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాను ఎదుర్కోనుంది. అక్టోబరు 7న కేప్‌టౌన్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. 2023 ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్-ఆస్ట్రేలియానే తలపడగా.. అహ్మదాబాద్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది.దేశం తరఫున ప్రపంచకప్‌లో ఆడే అవకాశం కెరీర్‌లో పరిమితంగానే లభిస్తుందని గిల్ అన్నాడు. అందుకే ప్రతి ప్రపంచకప్ తనకు ప్రత్యేకమేనని పేర్కొన్నాడు. కెప్టెన్సీ చిన్నప్పటి తన ప్రధాన లక్ష్యం కాదని, భారత్ తరఫున ఆడి జట్టును గెలిపించడమే తన అసలు కోరిక అని తెలిపాడు. వ్యక్తిగత రికార్డులు, ర్యాంకింగ్స్ కంటే జట్టు విజయం తనకు ముఖ్యమని గిల్ స్పష్టం చేశాడు.



# ఫజల్‌హక్ ఫరూఖీకి జాక్‌పాట్

### రూ.3.6 కోట్లకు అమ్మకం

**దుబాయ్, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** అంతర్జాతీయ లీగ్ టీ20-2026 వేలంలో అఫ్ఘానిస్థాన్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీకి భారీ ధర పలికింది. ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ ఫరూఖీని 3,80,000 అమెరికన్ డాలర్లకు.. అంటే సుమారు రూ. 3.6 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐఎల్‌టీ20 చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా ఫరూఖీ రికార్డు సృష్టించాడు. ఫరూఖీకి ముందు ఈ రికార్డు వెస్టిండీస్ ఆటగాడు ఆండ్రీ ఫ్లెచర్ పేరిట ఉండేది. ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ వేలంలో ఫ్లెచర్‌ను ఎంఐ ఫ్రాంచైజీ 2,60,000 అమెరికన్ డాలర్లకు.. దాదాపు రూ. 2.45 కోట్లకు కొనుగోలు చేసింది. తాజాగా ఫరూఖీ కోసం ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ అంతకంటే భారీ మొత్తాన్ని వెచ్చించి ఆ రికార్డును అధిగమించింది. ఇదే వేలంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, అఫ్ఘానిస్థాన్ వికెట్‌కీపర్ బ్యాటర్ రహ్మనుల్లా గుర్బాజ్ కూడా భారీ ధర పలికారు. లివింగ్‌స్టోన్‌ను 3,50,000 డాలర్లకు.. సుమారు రూ. 3.36 కోట్లకు గల్ఫ్ జెయింట్స్ దక్కించుకుంది. గుర్బాజ్‌ను 3,10,000 డాలర్లకు.. దాదాపు రూ. 3 కోట్లకు అదే జట్టు రైట్-టు-మ్యాచ్ అవకాశాన్ని ఉపయోగించి సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ కోసం కూడా ఫ్రాంచైజీల మధ్య పోటీ నెలకొంది. చివరకు దుబాయ్ క్యాపిటల్స్ అతడిని 3,00,000 అమెరికన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఫరూఖీకి దక్కిన భారీ ధరతో ఐఎల్‌టీ20 వేలంలో నాణ్యమైన పేసర్లకు ఉన్న డిమాండ్ మరోసారి స్పష్టమైంది.



# వర్షం పడితే భారత్, పాక్‌కు సంయుక్త స్వర్ణం

**నాగోయా, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడలు-2026 పురుషుల క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య స్వర్ణ పతక పోరుకు రంగం సిద్ధమైంది. అక్టోబరు 3న జరిగే ఈ ఫైనల్‌కు వర్షం ముప్పు ఉండటంతో నిర్వాహకులు కీలక నిబంధనను ప్రకటించారు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దై ఫలితం తేలకపోతే భారత్, పాకిస్థాన్‌లను సంయుక్త విజేతలుగా ప్రకటించి ఇరు జట్లకూ స్వర్ణ పతకాలు అందజేస్తారు. ఫైనల్‌కు ప్రత్యేకంగా రిజర్వ్ డే కేటాయించలేదు. నిర్ణీత రోజునే మ్యాచ్ ఫలితం తేలాల్సి ఉంటుంది. కనీసం ఐదు ఓవర్ల చొప్పున ఆట సాధ్యమైతే డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో విజేతను నిర్ణయిస్తారు. అలా కనీస ఆట కూడా సాధ్యం కాకపోతే మ్యాచ్‌ను 'నో రిజల్ట్'గా ప్రకటించి రెండు జట్లకూ స్వర్ణం పంచుతారు. గత ఆసియా క్రీడల్లో ఫైనల్ రద్దైనప్పుడు మెరుగైన సీడింగ్ ఆధారంగా భారత్‌ను విజేతగా ప్రకటించగా.. ఈసారి ఆ విధానాన్ని మార్చారు. మ్యాచ్ టై అయితే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే ఫైనల్ ఫలితం నిబంధనల ప్రకారం నిర్ణయించాల్సి ఉంటుంది. భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను ఓడించగా.. పాకిస్థాన్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించి తుదిపోరుకు చేరాయి. అక్టోబరు 3న జపాన్‌లోని నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 3 అక్టోబర్ 2026



# మూడుసార్లు తప్పా

## అక్షర హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 2 (స్పంద న్యూస్): సినీ కుటుంబం నుంచి వచ్చిన వారికి అవకాశాలు సులభంగా వస్తాయని చాలామంది భావిస్తుంటారు. అయితే తన ప్రయాణం మాత్రం అందుకు భిన్నంగా సాగిందని నటి అక్షర హాసన్ తెలిపారు. లోకనాయకుడు కమల్ హాసన్, నటి సారికల కుమార్తె, శ్రుతి హాసన్ సోదరి అయిన అక్షర.. తాజాగా సైరస్ బ్రూచా పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, చదువు, సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ తాను నేరుగా నటిగా కెరీర్ ప్రారంభించలేదని అక్షర చెప్పారు. తొలుత స్నేహితుల సంగీత వీడియోలకు నృత్య కొరియోగ్రఫీ చేసినట్లు తెలిపారు. సినిమాలపై ఆసక్తి పెరగడంతో సహాయ దర్శకురాలిగా పనిచేశానని వెల్లడించారు. వాస్తవానికి తనకు దర్శకత్వంపై ఎక్కువ ఆసక్తి ఉందని, భవిష్యత్తులో కచ్చితంగా మెగాఫోన్ పట్టి సినిమా తెరకెక్కిస్తానని పేర్కొన్నారు. నటనలోకి అడుగుపెట్టడం కూడా తన ప్రయాణంలో ఓ ప్రయత్నమేనని అక్షర తెలిపారు. నటిగా తనను తాను నిరూపించుకున్నప్పటికీ దర్శకత్వం చేయాలన్న కోరిక మాత్రం అలాగే ఉందని చెప్పారు. తన విద్యాభ్యాసం గురించి కూడా అక్షర ఎలాంటి దాపరికం లేకుండా మాట్లాడారు. హైస్కూల్ చదువులో తాను పెద్దగా రాణించలేకపోయానని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో వరుసగా మూడుసార్లు విఫలమైనట్లు వెల్లడించారు. ఆ తర్వాత చదువుపై ఆసక్తి తగ్గిపోయిందని, పాస్ కావడం కష్టంగా అనిపించడంతో చదువును మధ్యలోనే ఆపేశానని చెప్పారు. అయితే చదువులో ఎదురైన వైఫల్యాలు తన జీవితాన్ని ఆపలేదని అక్షర పేర్కొన్నారు. తనకు ఆసక్తి ఉన్న కళలు, సినిమాపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. తనకు నచ్చిన రంగంలో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. కమల్ హాసన్, సారికల కుమార్తె కావడంతో తాము తప్పనిసరిగా నటనలోనే కొనసాగాలనే ఒత్తిడి కుటుంబంలో ఎప్పుడూ లేదని అక్షర వెల్లడించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను తల్లిదండ్రులు ఇచ్చారని తెలిపారు. నటన ఇష్టం లేకపోతే మరో రంగంలో స్థిరపడాలని, తమకు నచ్చిన పని చేసుకోవచ్చని తల్లిదండ్రులు ప్రోత్సహించేవారని చెప్పారు. కుటుంబంలో సినిమాలకు సంబంధించిన విషయాలను చాలా సీరియస్‌గా చర్చిస్తామని అక్షర తెలిపారు. తాను నటించిన సన్నివేశాలు నచ్చకపోతే కుటుంబ సభ్యులు మొహమాటం లేకుండా తమ అభిప్రాయాన్ని చెబుతారని వెల్లడించారు. తప్పుల నుంచి నేర్చుకునే అవకాశం ఇస్తూ, వాటిని తామే గుర్తించేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించేవారని అక్షర పేర్కొన్నారు.



# సమంతకు హైకోర్టు రక్షణ

## డీప్‌ఫేక్‌లపై కీలక ఆదేశాలు

**ముంబై, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** సినీ తారల పేరు, ఫొటోలు, గొంతు, రూపాన్ని అనుమతి లేకుండా కృత్రిమ మేధ సాయంతో ఉపయోగించి డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ కంటెంట్ రూపొందించడం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో నటి సమంత రూత్ ప్రభుకు బాంబే హైకోర్టులో మధ్యంతర ఊరట లభించింది. సమంత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి మాధవ్ జామ్దార్.. ఆమె పేరు, ఫొటో, గొంతు, వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించిన అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించాలని సంబంధిత వేదికలను ఆదేశించారు. తన అనుమతి లేకుండా పలు వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ వేదికల్లో తన గుర్తింపును ఉపయోగిస్తున్నారని సమంత పిటిషన్‌లో పేర్కొన్నారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు, కృత్రిమ మేధతో రూపొందించిన గొంతు కంటెంట్, అభ్యంతరకర వీడియోలు, తన గుర్తింపును ఉపయోగించే సంభాషణ ఆధారిత కృత్రిమ మేధ సేవల గురించి ఆమె తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమంత వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు భంగం కలిగించేలా కంటెంట్ రూపొందించి ప్రచారం చేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని కోర్టు పేర్కొంది. గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ గౌరవానికి సంబంధించిన హక్కులతో పాటు కళాకారిణిగా ఆమెకు ఉన్న నైతిక హక్కులకూ చట్టపరమైన రక్షణ ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గుర్తించిన అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించడంతో పాటు భవిష్యత్తులో సమంత పేరు, ఫొటో, గొంతు తదితర వ్యక్తిత్వ లక్షణాలను అనుమతి లేకుండా ఉపయోగించడాన్ని అడ్డుకునేలా మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి వ్యక్తుల రూపం, గొంతు, గుర్తింపును అనుమతి లేకుండా మార్చి లేదా వినియోగించి కంటెంట్ సృష్టించడం పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వేదికలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ కేసు మరోసారి ముందుకు తెచ్చింది. సామాజిక మాధ్యమాలు, ఇతర మధ్యవర్తి వేదికలు అనధికారికంగా ప్రచారం అయ్యే కంటెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. సమంత దాఖలు చేసిన కేసు తదుపరి విచారణ డిసెంబరు 10న జరగనుంది.

# ఉత్కంఠతో సాగే గ్రామీణ క్రైమ్ థ్రిల్లర్ 'తత్వం'

**హైదరాబాద్, అక్టోబరు 02 (స్పంద న్యూస్):** దినేష్ తేజ్, దాస్విక కింతాలి ప్రధాన పాత్రల్లో అర్జున్ కోలా దర్శకత్వంలో తెరకెక్కిన గ్రామీణ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'తత్వం' ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సుక్కురెడ్డి, ఆనంద్ భారతీ, జబర్దస్త్ కృష్ణ, భోగిరెడ్డి శ్రీనివాస్, ప్రమోదిని తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్‌కే ప్రొడక్షన్, త్రయాధి ఇషానీ క్రియేషన్స్ పతాకాలపై వంశీ సీమకృతి నిర్మించారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుందో పరిశీలిద్దాం.

**కథా నేపథ్యం:** రామాపురానికి చెందిన మూర్తి, నాగమణి దంపతుల కుమారుడు సుధ మతిస్థిమితం లేని యువకుడు. అతడి వల్ల తల్లిదండ్రుల ప్రాణాలకే ప్రమాదమని ఒక జ్యోతిష్యుడు ముందే హెచ్చరిస్తాడు. అనూహ్యంగా ఆ దంపతులు దారుణ హత్యకు గురికావడంతో, గ్రామస్థులంతా సుధనే నిందితుడిగా భావించి అతడిపై దాడికి దిగుతారు. అదే సమయంలో పెళ్లి చూపుల కోసం గ్రామానికి వచ్చిన కానిస్టేబుల్ కల్యాణ్ (దినేష్ తేజ్)కు ఈ హత్యల దర్యాప్తు బాధ్యతను అధికారులు అప్పగిస్తారు. అయితే సుధ నిర్దోషి అని సౌమ్య (దాస్విక) బలంగా నమ్మగా, స్థానిక వడ్డీ వ్యాపారి కిషోర్ బాబు మాత్రం సుధనే హంతకుడని వాదిస్తూ కేసును త్వరగా ముగించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తాడు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు కల్యాణ్‌ను కేసు నుంచి తప్పించినప్పటికీ, అతడు వ్యక్తిగతంగా విచారణను కొనసాగిస్తాడు. అసలు సుధ తల్లిదండ్రులను హత్య చేసింది ఎవరు, సుధపై వచ్చిన ఆరోపణల్లో నిజమెంత, కిషోర్ బాబు ఎందుకు కేసును త్వరితగతిన ముగించాలని చూశాడు అనే విషయాల చుట్టూ మిగతా కథ తిరుగుతుంది.




**విశ్లేషణ:** మూఢనమ్మకాలు, గ్రామీణ రాజకీయాలు మరియు హత్యల నేపథ్యంతో కథను అల్లుకున్న దర్శకుడు అర్జున్ కోలా, మతిస్థిమితం లేని యువకుడిని ప్రధానంగా చేసుకుని భావోద్వేగ సంఘర్షణను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. సాధారణ క్రైమ్ థ్రిల్లర్‌ల లాంటి పోలీస్ దర్యాప్తుతో పాటు సమాజం ఒక అమాయకుడి పట్ల చూపే వైఖరిని ఇందులో చక్కగా చూపించారు. తొలి భాగంలో పాత్రల పరిచయానికే ఎక్కువ సమయం కేటాయించడంతో కథనం కొంత నెమ్మదిగా సాగి సాగదీసినట్లు అనిపిస్తుంది. అయితే ద్వితీయార్థంలో వచ్చే ఊహించని మలుపులు, సస్పెన్స్ సన్నివేశాలు ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తాయి. కానిస్టేబుల్ కల్యాణ్ సమగ్రంగా కేసు చిక్కుముళ్లను విప్పే విధానం ఆకట్టుకుంటుంది. మొదటి భాగంలో కథనాన్ని మరికాస్త వేగవంతం చేసి ఉంటే సినిమా ప్రభావం మరింత పెరిగేది.

### నటీనటులు, సాంకేతిక విభాగం:

కానిస్టేబుల్ కల్యాణ్ పాత్రలో దినేష్ తేజ్ సహజ సిద్ధమైన హావభావాలతో మెప్పించగా, సౌమ్యగా దాస్విక తన పరిధి మేరకు నటించింది. సుధ పాత్రలో నటించిన నటుడు మానసిక సంఘర్షణను, భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. సాంకేతికంగా భరత్ పట్టి ఛాయాగ్రహణం గ్రామీణ వాతావరణాన్ని విజువల్‌గా చాలా సహజంగా ఆవిష్కరించింది. చైతన్ భరద్వాజ్ అందించిన నేపథ్య సంగీతం సస్పెన్స్ సన్నివేశాలకు ఊపునిచ్చింది. విప్లవ్ నైషదం ఎడిటింగ్ తొలి భాగంపై ఇంకాస్త దృష్టి పెట్టి ఉంటే బాగుండేది. మొత్తంగా, కొత్త కథాంశాలను, క్రైమ్ థ్రిల్లర్లను ఆస్వాదించే ప్రేక్షకులకు 'తత్వం' ఒక ఓ మోస్తరు గ్రామీణ థ్రిల్లర్‌గా అలరిస్తుంది. ప్రథమార్ధంలో నెమ్మదిగా సాగే కథనాన్ని కొంత ఓపికతో చూస్తే, ద్వితీయార్థంలో వచ్చే మలుపులు వినోదాన్ని అందిస్తాయి.

# తెలంగాణ యాసలో సితార

**హైదరాబాద్, అక్టోబరు 2 (స్పంద న్యూస్):** సూపర్‌స్టార్ మహేశ్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. డ్యాన్స్ వీడియోలు, విహారయాత్రలకు సంబంధించిన పోస్టులతో ఇప్పటికే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సితార.. తాజాగా మరో కారణంతో వార్తల్లో నిలిచారు. ఫహాద్ ఫాజిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రచారంలో భాగంగా ఆమె చేసిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సితార ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా ఆంగ్లంలో మాట్లాడే వీడియోల్లో కనిపించేవారు. అప్పుడప్పుడు తెలుగులో మాట్లాడినా.. తాజాగా మాత్రం అందుకు భిన్నంగా పక్కా తెలంగాణ యాసలో మాట్లాడి ఆకట్టుకున్నారు. 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్'లో మ్యాజిక్ చేసే పాత్రలో నటించిన సారా పాలేకర్‌తో కలిసి సితార ఈ ప్రచార వీడియోలో కనిపించారు. సారా మ్యాజిక్ ట్రిక్స్ చేస్తుండగా వాటిని చూస్తూ సితార ఇచ్చిన స్పందనలు సహజంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'ఆగు.. ఇటు రా', 'ఇట్లానా.. అట్లానా?' అంటూ ఆమె పలికిన మాటలు హైదరాబాద్, తెలంగాణ యాసను గుర్తు చేస్తున్నాయి. సహజమైన హావభావాలతో ఆమె మాట్లాడిన తీరు నెటిజన్లను ఆకర్షిస్తోంది. వీడియోలో సారా పాలేకర్.. తదుపరి విహారయాత్రకు ఎక్కడికి వెళ్లాలని అనుకుంటున్నావని సితారను అడుగుతుంది. అందుకు సితార 'మూన్‌కి వెళ్దాం.. ఆ తర్వాత మార్స్‌కి పోదాం' అంటూ సరదాగా సమాధానం ఇచ్చారు. ఆమె మాటతీరు, తెలంగాణ యాస, సహజమైన స్పందనలు వీడియోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహేశ్ బాబు అభిమానులతో పాటు సితారను సామాజిక మాధ్యమాల్లో అనుసరించే వారు ఈ వీడియోను ఆసక్తిగా చూస్తున్నారు. సాధారణంగా ఆంగ్లంలో ఎక్కువగా మాట్లాడే సితార.. ఇలా సహజమైన తెలంగాణ యాసలో మాట్లాడటం అభిమానులకు కొత్తగా అనిపించింది. ప్రస్తుతం ఈ వీడియోను పలువురు అభిమానులు పంచుకుంటూ సితార మాటతీరుపై స్పందిస్తున్నారు.



"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే స్పందన జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 3 అక్టోబర్ 2026



## ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం

**పెదకాకాని, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** మండల కేంద్రమైన పెదకాకాని గ్రామంలో ఐసీడీఎస్ పొన్నూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ ఏసీడీపీఓ విజయరాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయరాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు తక్కువ ఖర్చుతోనే ఎక్కువ పోషకాహారం అందించడం జరుగుతోందన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన పోషకాహారాన్ని ప్రభుత్వం ఎంతో తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని మండల స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ ఈవో ప్రసాద్ రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రహిమాన్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, లింగంగుంట సాల్మన్ రాజ్, ఆలపాటి ఉమామహేశ్వర రావు, అజీజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సత్యం, అహింసల స్ఫూర్తిదాత మహాత్మా గాంధీ

**ఆర్యవైశ్య గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట వెంకటేశ్వర్లు**



**ప్రత్తిపాడు, అక్టోబర్ 02 (స్పందన న్యూస్):** సత్యం, అహింసల మార్గంలో నడుస్తూ దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించిన స్ఫూర్తిదాత జాతిపిత మహాత్మా గాంధీ అని ఆర్యవైశ్య గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట వెంకటేశ్వర్లు కొనియాడారు. శుక్రవారం ప్రత్తిపాడు గ్రామంలో మట్ట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ వారిపై ఎలాంటి హింసకు పాల్పడకుండా, కేవలం సత్యం, అహింసలనే ఆయుధాలుగా చేసుకుని దేశ ప్రజలందరినీ ఏకం చేసిన గొప్ప నాయకుడు గాంధీజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధులలో అగ్రగణ్యుడైన ఆయనను ప్రజలు మహాత్ముడిగా, జాతిపితగా నిత్యం స్మరించుకుంటారని తెలిపారు. కొల్లాయి కట్టి, చేతికర్ర పట్టి, నూలు వడికి, మురికివాడలను శుభ్రం చేస్తూ.. కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కటే అని చాటిచెప్పిన గొప్ప న్యాయవాది, రాజనీతిజ్ఞుడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ అని ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బంధం వెంకట్రావు, సూర్య పరమేశ్వరరావు, మద్ది వెంకటేశ్వర్లు, దోగిపర్తి శ్రీనివాసరావు, అరవపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా ర్యాలీ




**తెనాలి, అక్టోబర్02(స్పంద న్యూస్):** ఆయుధాలు లేకుండా,రక్తపాతం లేకుండా కేవలం సత్యం, అహింసా మార్గంలో ప్రపంచంలోనే అతిపెద్ద బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి నిలువ వచ్చని గాంధీజీ నిరూపించారని పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీఅండ్ ఎన్సిసి ఇన్స్ట్రక్టర్ సామ్రాజ్యం పేర్కొన్నారు.శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పాఠశాలకు చెందిన ఎన్సీసీ విద్యార్థులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'స్వచ్ఛతా హై సేవా- ప్రచారంలో భాగంగా స్కూల్ లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెదరావూరు పురవీధుల్లో చైతన్య ర్యాలీ ని స్లొగన్స్ చేస్తూ నిర్వహించారు. ఈ ర్యాలీ లో స్కూలు ప్రధానోపాధ్యాయులు సరళ, ఉపాధ్యాయులు అరుణ, పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు.

## గాంధీ జయంతి సందర్భంగా అన్నదానం

**తెనాలి, అక్టోబర్02(స్పంద న్యూస్):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక మారిస్ పేట అలంకార్ టాకీస్ ఎదురుగా గల లక్ష్మీ గణపతి డిపార్ట్మెంట్ స్టోర్స్ ప్రాంగణము నందు గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్యాత్మిక కమిటీ,జిల్లా ఆధ్యాత్మిక కమిటీ మహిళా విభాగం , కైలాసగిరి భక్త సేవా సమితి తెనాలి సంయుక్త నిర్వహణలో చైర్మన్ శ్రికాకొలను లక్ష్మీనారాయణ గుప్తా, జిల్లా మహిళా విభాగం ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ శ్రికాకొలను అరుణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు చందూరు ఉమామహేశ్వరరావు సెక్రటరీ కొత్త రామారావు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించినారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కమిటీ వైస్ చైర్మన్లు కురిచేటి నరసింహారావు, కారుమూరి శ్రీనివాసరావు, చందూరు రవికుమార్, కొత్త మాసు వినోద్, కట్టమూరి శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తాడికొండ సుబ్రహ్మణ్యం, మైలవరపు వెంకట కోటేశ్వరరావు,తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘంఅధ్యక్షుల , వాసవి సేవాదళ్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**గుంటూరు, అక్టోబర్ 02 (స్పందన న్యూస్) :** వర్కింగ్ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భక్తవత్సలరావు, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఐజేయూ పిలుపు మేరకు నిర్వహించిన 'వర్కింగ్ జర్నలిస్టుల కోర్కెల దినం'లో భాగంగా శుక్రవారం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి హిమని సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టి, మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తవత్సలరావు మాట్లాడుతూ మీడియా రంగంలో చోటుచేసుకున్న సాంకేతిక, సామాజిక మార్పులను సమగ్రంగా సమీక్షించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల రక్షణకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకు రావడంతో పాటు, 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల ద్వారా కల్పించిన హక్కులు, రక్షణలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేజ్బోర్డు ఏర్పాటు చేసి ప్రస్తుత జీవన వ్యయాలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని కోరారు. రాంబాబు మాట్లాడుతూ ఏపీలో వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, జర్నలిస్టు ప్రతినిధులతో త్రైపాక్షిక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసి డబ్ల్యూజేహెచ్ఎస్ ను సమర్థంగా అమలు చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అమలైన వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ను




పునఃప్రారంభించాలని, ఎన్నికల హామీ మేరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన సీనియర్ పాత్రికేయులకు పింఛను, గతం లో ఉన్న 50శాతం రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు కె. తిరుపతిరెడ్డి, అధ్యక్షుడు కొంగర వెంకయ్య, కార్యదర్శి కార్తీక్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వరరావు, ఏ. వీరభద్రరావు, నహాయ కార్యదర్శులు కె.సుజిబాబు, జి.అప్పారావు, పి. రామ్భాస్కర్, కార్యవర్గ సభ్యులు లూర్ధరాజు, పవన్, మొఘలయ్య, సామ్నా జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, శ్రీధర్ బాబు, రాంబాబు, రెహ్మాన్, వి.నాగరాజు, మురళి, సాగర బాబు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర, గుండె వైద్య శిబిరానికి 350 మంది హాజరు

**దాచేపల్లి, అక్టోబరు 2(స్పంద న్యూస్):** ది మదర్ స్వచ్ఛంధ సేవా సంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ,పెదకాకాని శంకర కంటి అసుపత్రి, విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ హస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో గల ఇరికేపల్లి లో ఉచిత నేత్ర, గుండె వైద్య శిబిరానికి సుమారు 350 రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఇరికేపల్లి లోని నాగెండ్ల రత్నం కాంప్లెక్స్ లో జరిగిన ఉచిత వైద్య శిబిరం లో సుమారు 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా, సుమారు 50 మంది శస్త్ర చికిత్సలు అవసరం కాగా, వారిలో కొంతమందిని పెదకాకాని శంకర కంటి అసుపత్రి కి తరలించారు. గుండెకు సంబందించి విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటి వైద్యులు సుమారు 200 మందికి గుండె పరీక్షలు నిర్వహించారు. అందులో కొంతమందికి మందులు సూచించగా, మరి కొందరిని అసుపత్రి లో పూర్తిస్థాయి గుండెకు సంబందించిన పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా నేత్ర, గుండె పరీక్షలు చేసిన వైద్యులను ది మదర్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షురాలు నాగెండ్ల




సుమతీ రత్నం, సభ్యులు నాగెండ్ల సౌరబ్ జాన్సన్, పెద్దలు నాగెండ్ల జీవరత్నం, నాగెండ్ల మార్క్,ఉపాధ్యాయులు నాగెండ్ల యేషయ్య, మాజీ ఎంపిటీసీ మాతంగి మమత రాంబాబు, యూత్ సభ్యులు కుంపటి నాగరాజు, నాగెండ్ల ఆనంద్ బాబు, నాగెండ్ల సదేష్ లు దుశ్శాలువలతో సన్మానించారు.దూర ప్రాంతం నుండి వైద్య శిబిరానికి హాజరైనా రోగులకు ది మదర్ స్వచ్ఛంద సంస్థ భోజన సదుపాయం ఏర్పాటు చేసింది.

# పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

**ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య**

**చీరాల అక్టోబర్ 2 ( స్పంద న్యూస్):** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య అన్నారు. శుక్రవారం జర్నలిస్ట్ డే సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకి జర్నలిస్టు సోదరులు వినతి పత్రం అందజేసిన సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి. సుబ్బారావు పిలుపు మేరకు జర్నలిస్టులు ఎమ్మెల్యే కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. జర్నలిస్టులకు ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావడంతో పాటు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను పునరుద్ధరించాలని, నూతన వేతన బోర్డు ఏర్పాటు తో పాటు జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణ, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు, ప్రమాద



బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు. అలాగే వెటరన్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించి గతంలో ఉన్న రైల్వే 50 శాతం ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరడం జరిగింది. వినతి పత్రం అందజేసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే స్థానిక యూనియన్ సభ్యులు, జర్నలిస్టు సోదరులు పాల్గొన్నారు.

# దాచేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఘర్షణ

**పరస్పరం దాడులు చేసుకున్న తహశీల్దార్, సర్వేయర్**

**పోలీసులకు తహశీల్దార్ ఫిర్యాదు**

**దాచేపల్లి, అక్టోబరు 2(స్పంద న్యూస్):** పల్నాడు జిల్లా దాచేపల్లి తహశీల్దార్ కార్యాలయం లో అహింసే ఆయుధం అంటూ సమాజానికి నిర్ధేశం చేసిన జాతిపిత మహత్మ గాంధీ జయంతి రోజున ఎవరు ఉహించని ఒక దాడి సంఘటన చోటు చేసుకుంది. దాచేపల్లి తహశీల్దార్ జి. శ్రీనివాసులు, నడికుడి వార్డు సర్వేయర్ హనుమంతు లు కార్యాలయం లో ఘర్షణ దిగి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. సంఘటన నేపధ్యంకు సంబంధించి వివరాల్లోకి వెళితే తన భూమి వివరాలను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని నడికుడి గ్రామానికి చెందిన సంధ్య అనే మహిళ ఏడాదిగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుంది. తనకు ఉన్న భూమిలో కొంత వెబ్ ల్యాండ్‌లో నమోదు కాలేదని అధికారులను కోరింది. గత ఏడాది నుంచి తిరుగుతున్నా విఆర్ ఓ, సర్వేయర్ పట్టించుకోక పోవడంతో సమస్య ను తాసీల్దార్ శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చింది. సదరు భూమిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని నడికుడి విఆర్ ఓ,సర్వేయర్‌కి తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దార్ ఆదేశించినా సమస్య పరిష్కరించకుండా నడికుడి విఆర్ఓ, సర్వేయర్‌లు నిర్లక్ష్యం వహించటంతో




తన కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని సర్వేయర్‌కి తహసీల్దార్ ఆదేశాలు జారీచేశారు. దరఖాస్తు తన దృష్టికి రాలేదని సర్వేయర్ హనుమంతు తహసీల్దార్ కి దురుసుగా సమాధానం చెప్పటంతో సర్వేయర్‌ని తహసీల్దార్ మందలించారు. దీంతో వాగ్వాదం ముదరడంతో ఇరువురు పరస్పరం దాడికి పాల్పడ్డారు. కార్యాలయంలోనే పరస్పరం ఇరువురు దాడులు చేసుకున్నారు. జరిగిన ఘటనపై తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించటంతో పాటు దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై నివేదిక ఇవ్వాలని గురజాల ఆర్ డి ఓ కు ఉన్నతాధికారుల ఆదేశాలు జారీచేశారు.ఇరువురి దాడి ఘటన జిల్లా రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

స్పంద
శనివారం, 3 అక్టోబర్ 2026

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు





**■ విజయవంతంగా రక్తదాన శిబిరం!**

**పెదనందిపాడు, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో శుక్రవారం అశోక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో భాగంగా ముందుగా రోటరీ జిల్లా గవర్నర్ ఉదయ్ పిలాని స్థానిక గ్రంథాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం, శాంతి, అహింస మార్గాలు నేటి ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. తన పూర్వీకులు గాంధీజీ శిష్యులని, ఆచార్య వినోబా భావే చేపట్టిన భూదాన ఉద్యమంలో తమ కుటుంబం లక్ష ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిందని గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 2008 నుంచి క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ వనజ పర్యవేక్షించారు. ఇదే వేదికపై పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఉదయ్ పిలానితో పాటు దాతలు విద్యాసాగర్ గుప్తా, అరవపల్లి కృష్ణమూర్తిలను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ రీజనల్ చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు, కార్యదర్శి కోదండరామిరెడ్డి, సభ్యులు కోడూరి నాగేశ్వరరావు, కాపు వెంకట్రావు, నాగరాజు, పుల్లారావు, విక్టర్ జాన్ పాల్, సాంబశివరావుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతమాత నేత్రద్వయం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి



**చిలకలూరిపేట, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సత్యం, అహింస, సత్యాగ్రహాల ద్వారా తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్మా గాంధీజీ, 'జై జవాన్ – జై కిసాన్' నినాదంతో ఆహార ఉత్పత్తులను పెంచి దేశ రక్షణకు పెద్దపీట వేసిన లాల్ బహదూర్ శాస్త్రి భారతమాతకు రెండు కళ్ల లాంటి వారని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం. రాధాకృష్ణ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. ప్రసన్న అధ్యక్షతన మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పల్నాడు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చేరెడ్డి శ్రీరామిరెడ్డి, కిసాన్ సెల్ సీనియర్ నాయకుడు బొడ్లపాటి రామకోటేశ్వరరావు, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శులు గోవిందు శంకర్ శ్రీనివాసన్, ఉప్పుటూరి అనిల్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం. రాధాకృష్ణ మాట్లాడుతూ.. గ్రామసీమల అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అన్న బాపూజీ మాటలు నిజం కావాలంటే, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దీనిద్వారా గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయవచ్చన్నారు. అలాగే శాస్త్రీజీ చూపిన నైతిక మార్గంలో నేటి పాలకులు నడవాలని, నైతిక బాధ్యత వహించడమే పాలకుల ఉన్నత స్థితికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ నస్రుద్దీన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ కరిమున్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కల్యాణం రాఘవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎర్రగళ్ల రవికుమార్, షేక్ బాజీ, కోవూరి శ్రీధర్, యువజన కాంగ్రెస్ నాయకులు ఇంటూరి భవాని వెంకటేష్, షేక్ ఇస్మాయిల్, నిడమానూరు వెంకట్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటూరి కోటేశ్వరరావు, లీగల్ సెల్ నాయకుడు ఎప్పాల అంజిరెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల పాల్ రాజ్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శులు పల్లెపోగు రాజు, దాసరి శ్యాంబాబు, షేక్ మహమ్మద్ రఫీ, షేక్ ముజీబ్, షేక్ మస్తాన్ షరీఫ్, దావల యేసోబు, ప్రత్తిపాటి కోటయ్య, నాంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# చీరాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**చీరాల అక్టోబర్ 2 ( స్పంద న్యూస్ )** భారత జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను చీరాలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముందుగా స్థానిక మునిసిపల్ పరిధిలోని తెల్ల గాంధీ, మరియు నల్ల గాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వేటపాలెం మండలం కొత్తపేట గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల మైదానం లో శాసనసభ్యుల ఆధ్వర్యంలో సేవా మేరా యోగ్ దాన్ పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత అనే సంకల్పంతో "సేవా మేరా యోగ్ దాన్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాలు నేటికీ మనకు మార్గదర్శకమని, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజలను ఏకం చేసి నడిపించిన తీరు చిరస్మరణీయమని అన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, స్వావలంబనతో కూడిన, పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరం పని చేయాలన్నారు. భారతదేశ నిర్మాణంలో భాగంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కోసం గాంధీజీ చూపిన బాటలో నడుద్దాం అని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాఠశాల విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అహింసా మూర్తికి అవమానం

## గాంధీ జయంతి రోజు బహిరంగంగా మాంసం విక్రయాలు!

### మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు?

**చిలకలూరిపేట, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన శాంతిదూత, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున జీవహింసకు దూరంగా ఉండటం ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2న మద్యం, మాంసం విక్రయాలపై పూర్తిగా నిషేధం అమల్లో ఉంటుంది. అయితే ఇందుకు భిన్నంగా చిలకలూరిపేట పట్టణంలో మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మార్కెట్ సెంటర్ పరిధిలోని చికెన్, మటన్ స్టాళ్లతో పాటు మోడల్ ఫిష్ మార్కెట్లో చేపల విక్రయాలు బహిరంగంగానే సాగాయి. గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలు నిలిపివేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మాంసం దుకాణదారులకు ముందస్తుగా నోటీసులు కూడా ఇచ్చామని తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో దుకాణాలు యథావిధిగా తెరిచి ఉండటం, అమ్మకాలు కొనసాగడంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి దుకాణం నుంచి వేల రూపాయల మామూళ్లు తీసుకుని అధికారులు నిబంధనలను పక్కనబెట్టారని ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ప్రకటన కేవలం కాగితాలకే పరిమితమా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# దాచేపల్లి పీఎస్‌లో గాంధీ జయంతి

**దాచేపల్లి, అక్టోబరు 2(స్పంద న్యూస్):** భారత జాతిపిత మహాత్మగాంధీ 157వ జయంతి వేడుకలను పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీస్ స్టేషన్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి దాచేపల్లి సి ఐ షేక్ ఖాజావలి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధేవిదంగా ఎస్ ఐ లు పాపారావు, షేక్ ఖాసీంవలి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అహింసే ఆయుధం అనే తన సిద్ధాంతంతో భారతదేశానికి స్వాతంత్ర్యం అందించిన గాంధీ పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ షణ్ముఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ మృతుల కుటుంబాలను పరామర్శించిన

# ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, అక్టోబర్ 2 ( స్పంద న్యూస్) :** రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ఇరువురి కుటుంబాలను శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పరామర్శించారు. శుక్రవారం స్థానిక రూరల్ మండలం తోటవారిపాలెంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఇస్సాకు (22), శ్యామ్ (21) కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించడం జరిగింది. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు తమ పరిస్థితిని వివరించారు. ఈనాటి పరామర్శ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు సీహెచ్‌సీకి అవార్డు ఆనందంగా ఉంది: డాక్టర్ ప్రవీణ్



**ప్రత్తిపాడు, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర (రాారాా) కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణలో విశేష కృషి చేసిన సంస్థలకు అందజేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్–2026లో సీహెచ్‌సీ ప్రత్తిపాడుకు అవార్డు లభించింది. గుంటూరులోని శంకరన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ చేతుల మీదుగా సీహెచ్‌సీ ప్రత్తిపాడు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది ఈ అవార్డును అందుకున్నారు. ఆసుపత్రిలో స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణతో పాటు రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వి. రంగా రావు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్వచ్ఛత, పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీహెచ్‌సీ ప్రత్తిపాడు సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ అవార్డు సాధ్యమైందని ప్రశంసించారు. ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు రోగులకు నాణ్యమైన వైద్యా సేవలు అందించడంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అవార్డు సాధించినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, వైద్యులు, నర్సింగ్, పారిశుద్ధ్య మరియు ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు.

# ఇంద్రకీలాద్రిపై దసరా ప్రదర్శనలకు దరఖాస్తుల ఆహ్వానం!

**విజయవాడ, అక్టోబర్ 02 (స్పంద న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ కళలు, సంగీతం, నృత్యం తదితర అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించాలనుకునే కళాకారులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న కళాకారులు తమ దరఖాస్తులను అక్టోబర్ 5వ తేదీలోపు సమర్పించాలని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. కళాకారులు తమ పూర్తి వివరాలు, ప్రదర్శనకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచి పోస్ట్ ద్వారా, ఈ–మెయిల్ ద్వారా లేదా నేరుగా ఆలయ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిశీలించబోమని స్పష్టం చేశారు. ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సవాలకు మరింత శోభ తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కళాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.